జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

NIZAMABAD EDITION

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967

నిజామాబాద్ | శనివారం 19 సెప్టెంబర్ 2026 | సంపుటి : 16 | సంచిక : 232 | పేజీలు : 8 | వెల : 1/- | RNI No. TELTEL/2010/35558

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయణం సూర్యోదయం: 5.42 । సూర్యాస్తమయం: 6.22 చంద్రోదయం: 4.57 । చంద్రాస్తమయం: 5.20 తిథి: బహుళ చతుర్దశి రా. 1.37 వరకు, తదుపరి అమావాస్య నక్షత్రం: పుష్యమి సా. 10.23 వరకు, తదుపరి ఆశ్లేష యోగం: సిద్ధి రా. 8.18 వరకు, తదుపరి వ్యతీపాత కరణం: భద్ర మ. 2.45 వరకు, తదుపరి శకుని రా. 1.37 వరకు, తదుపరి

Published from : NIZAMABAD, WARANGAL, RANGAREDDY, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



## గణేష్ నిమజ్జనానికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు

### శోభాయాత్ర మార్గాన్ని పరిశీలించిన ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర.. నిబంధనలు తప్పక పాటించాలి



**బాన్సువాడ, సెప్టెంబర్ 18 (ప్రజాజ్యోతి):** బాన్సువాడ పట్టణంలో గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర తెలిపారు. శుక్రవారం బాన్సువాడ పట్టణంలోని పలు గణేష్ మండపాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి మండపాల నిర్వాహకులతో మాట్లాడారు. అనంతరం అధికారులతో కలిసి ప్రత్యేక బస్సులో నిమజ్జన శోభాయాత్ర మార్గాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాత బాన్సువాడ చావిడి నుంచి సంగమేశ్వర్ కాలనీ, అంబేద్కర్ చౌరస్తా, తాడుకోల్ చౌరస్తా, గాంధీచౌక్, జండాగల్లి మీదుగా కల్కి చెరువు వరకు శోభాయాత్ర సాగే మార్గాన్ని పరిశీలించారు. - మిగతా2లో



## ఆలయాల చోరీల ముఠా గుట్టురట్టు

### సాంకేతిక ఆధారాలతో ముగ్గురి అరెస్ట్

### వివరాలు వెల్లడించిన ఎల్లారెడ్డి డిఎస్పీ శ్రీనివాస్ రావు



**గాంధారి, సెప్టెంబర్ 18(ప్రజాజ్యోతి )** గాంధారి మండలంలో వరుసగా జరుగుతున్న ఆలయాల చోరీలకు పోలీసులు చెక్ పెట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీ, సాంకేతిక ఆధారాలు, శాస్త్రీయ దర్యాప్తు ఆధారంగా కేసులను ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌రావు తెలిపారు. శుక్రవారం విడుదల చేసిన మీడియా నోట్‌లో కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.పోలీసుల వివరాల ప్రకారం.. గాంధారి ఇందిరానగర్ కాలనీకి చెందిన ఉప్పు సంతోష్ (25), గాంధారికి చెందిన ఒడ్డే జ్యోతి అలియాస్ దండుగల జ్యోతి అలియాస్ ర్యాపాని జ్యోతి (28), నందిపేటకు చెందిన చిట్టారి దేవి అలియాస్ ఒడ్డే రాజేశ్వరి (23) ఆలయాల్లో చోరీలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది.నందిపేట, పెద్దపోతంగల్, కన్కల్, భానాపూర్ తండా, గాంధారి, పిస్కాల్‌గుట్ట తండా తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో హుండీలు పగలగొట్టి నగదు, నాణేలు, బంగారు, వెండి ఆభరణాలు, ఇతర వస్తువులను అపహరించినట్లు పోలీసులు గుర్తించారు. మెహర్బా గుడి గెస్ట్‌హౌస్‌లోకి చొరబడి వద్మాన్‌కు చెందిన మొబైల్ ఫోన్‌ను సైతం చోరీ చేసినట్లు తెలిపారు.పిస్కాల్‌గుట్ట సేవాలాల్ ఆలయం నుంచి చోరీ చేసిన

## ప్లాస్టిక్ రహిత గ్రామంగా గొట్టిముక్కుల



ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు సమిష్టిగా కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



## పెన్షన్ దరఖాస్తుదారుల సర్వే.. ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

**కామారెడ్డి టౌన్ సెప్టెంబర్ 18 ప్రజా జ్యోతి** కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామంలో నూతనంగా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల అర్హతలను పరిశీలించేందుకు శుక్రవారం క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. గ్రామంలో పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను అధికారులు పరిశీలించి, అర్హతలను నమోదు చేశారు. దరఖాస్తుదారుల కుటుంబ పరిస్థితులు, సంబంధిత వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే ప్రక్రియను చేపట్టారు. అదేవిధంగా గ్రామంలో నిర్మాణంలో ఉన్న, మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఇళ్ల నిర్మాణ పనుల పురోగతి, లబ్ధిదారుల వివరాలు, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పనులు జరుగుతున్నాయా అనే అంశాలను పరిశీలించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా క్షేత్రస్థాయిలో వివరాలను నమోదు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్ రెడ్డి, - మిగతా2లో

## అభివృద్ధి పనులకు సహకరించాలి

### ఎమ్మెల్యేను కలిసిన సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు



**ఇందల్వాయి( ప్రజా జ్యోతి ) సెప్టెంబర్. 18** ఇందల్వాయి మండల కేంద్రానికి చెందిన పలు గ్రామాల సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు సుదర్శన్ నాయక్ ఆధ్వర్యంలో జీకే తండా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మహిపాల్ నాయక్‌తో కలిసి ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు, నిధుల సమీకరణ, అవసరమైన నియామకాలు, ఇతర ప్రజా కార్యక్రమాలపై ఎమ్మెల్యేతో చర్చించారు. గ్రామాల అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఎమ్మెల్యే సహకారం అందించాలని వారు కోరారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు తమకు సహకరించాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, గ్రామాల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై వారితో చర్చించినట్లు సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు సుదర్శన్ నాయక్ తెలిపారు. గ్రామాల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా సుదర్శన్ నాయక్ పేర్కొన్నారు.

# ప్లాస్టిక్ రహిత గ్రామంగా గొట్టిముక్కుల




**ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు సమిష్టిగా కృషి చేయాలి**
**జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 18(ప్రజా జ్యోతి)** దోమకొండ మండలం గొట్టిముక్కుల గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన ప్లాస్టిక్ రహిత గ్రామ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు గ్రామపంచాయతీ చేపడుతున్న చర్యలను అభినందించారు. గ్రామ సర్పంచ్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలను కలెక్టర్‌కు వివరించారు. కమ్యూనిటీల వారీగా స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులు కొనుగోలు చేసి, వివిధ శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాల్లో వాటిని వినియోగించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తద్వారా పేపర్ ప్లేట్లు, ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసుల వినియోగాన్ని తగ్గిస్తున్నట్లు వివరించారు. గ్రామంలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడవేయకుండా గ్రామపంచాయతీకి తీసుకువచ్చి అందజేసేలా ప్రజలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలను గ్రామపంచాయతీకి తీసుకువచ్చి అందజేసే వారికి ప్రోత్సాహకంగా స్టీల్ వాటర్ బాటిళ్లను అందిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా,ఐకేపీ సంఘ భవనంలో కమ్యూనిటీ కార్యక్రమాల కోసం నిత్య వినియోగానికి ఒక దాత 300 స్టీల్ ప్లేట్లను విరాళంగా అందించేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఆరు మహిళా సంఘాలకు కోటి రూపాయల బ్యాంక్ లింకేజీ రుణాలు కార్యక్రమంలో భాగంగా కెనరా బ్యాంక్ ద్వారా ఆరు మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ కింద మొత్తం కోటి రూపాయల రుణాలను మంజూరు చేశారు. ఈ సందర్భంగా రుణాలకు సంబంధించిన చెక్కులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సంఘాల ప్రతినిధులకు అందజేశారు. మహిళా సంఘాలు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆదాయాభివృద్ధి కార్యకలాపాలను చేపట్టి ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలని కలెక్టర్ సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ...!

గొట్టిముక్కుల గ్రామంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు చేపడుతున్న చర్యలు అభినందనీయమని అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం ఒక్కరి బాధ్యత కాదని, ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేసినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల నీరు, నేల, పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని క్రమంగా తగ్గించి, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ప్లాస్టిక్‌కు నో చెప్పండి వ్యాధులను నివారించండి. నీరు, నేల, పర్యావరణాన్ని పరిరక్షించండి" అనే సందేశాన్ని ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని కలెక్టర్ సూచించారు. గొట్టిముక్కుల గ్రామంలో చేపడుతున్న కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ, మరింత మందిని భాగస్వాములను చేయాలని అధికారులను ఆదేశించారు.

**విద్యార్థులతో అవగాహన కార్యక్రమం**

ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలు, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణపై యూపీఎస్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించే స్కిట్‌ను ప్రదర్శించారు. విద్యార్థుల ప్రదర్శనను జిల్లా కలెక్టర్, అధికారులు అభినందించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి ప్రతి ఇంటికి జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులకు బదులుగా పునర్వినియోగ జూట్ బ్యాగులను వినియోగించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, డీఆర్డీఏ పీడీ దామోదర్ రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ జ్యోతి, డీఎల్‌పీఓ శ్రీనివాస్, కెనరా బ్యాంక్ అధికారులు, గ్రామపంచాయతీ ప్రతినిధులు,మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**రైతునగర్--అన్నారం గ్రామపంచాయతీలకు 432 కార్డులు**



**బీర్కూర్, సెప్టెంబర్ 18 (ప్రజాజ్యోతి):** బీర్కూర్ మండల కేంద్రంలోని అన్నారం గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కవిత పండారి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కవిత పండారి మాట్లాడుతూ రైతునగర్, అన్నారం గ్రామపంచాయతీల పరిధిలో మొత్తం 432 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, జీపీ ఓ హనుమాన్లు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు దోసకాయ వెంకన్న, మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి, కరోబార్ సాయిలుతో పాటు గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రపంచ వెదురు దినోత్సవం



**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి)** కామారెడ్డి ప్రపంచ వెదురు దినోత్సవాన్ని పురస్కరించుకొని కామారెడ్డి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేదర మహేంద్ర సంఘం కేతేశ్వర స్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి జాతీయ బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. మల్లికార్జున్, డా. భవాని, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సాప శివరాములు, మేదర మహేంద్ర సంఘం జిల్లా అధ్యక్షులు కిషన్, కామారెడ్డి పట్టణ అధ్యక్షులు, భిక్కనూరు మండల అధ్యక్షులు రమేష్, ఏబీసీడీఓ చక్రధర్,ఏఓ రేవంత్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెదురు ఉత్పత్తుల ప్రాముఖ్యత, వాటి వినియోగం మరియు వెదురు ఆధారిత జీవనోపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. వెదురు పర్యావరణ పరిరక్షణకు ఎంతో ఉపయోగకరమైనదని, వెదురు ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం ద్వారా మేదర వృత్తిదారుల ఆర్థికాభివృద్ధికి తోడ్పడవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మేదర సంఘం ప్రతినిధులు పలు అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా: వెదురు ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలి. వెదురు సాగు/వెదురు ఉత్పత్తుల తయారీకి అవసరమైన ముడిసరుకుపై సబ్సిడీ కల్పించాలి. వెదురు మొక్కల పెంపకం కోసం బంజరు భూములను కేటాయించాలి. మేదర కుల వృత్తిదారులకు పింఛన్ సౌకర్యం కల్పించాలి. మేదర సంఘ భవన నిర్మాణానికి ప్రభుత్వ నిధులు కేటాయించాలి. కార్యక్రమంలో నరేష్, పవన్, స్వామి, శాంతయ్య వెంకటేష్, శ్రీకర్, అశ్వాక్, తిరుమల, అనసూయ తదితరులతో పాటు మేదర సంఘం సభ్యులు పాల్గొన్నారు. "వెదురును ప్రోత్సహిద్దాం -- పర్యావరణాన్ని కాపాడుదాం" అనే సందేశంతో ప్రపంచ వెదురు దినోత్సవాన్ని నిర్వహించారు.

# గొట్టిముక్కులలో చేయూత పెన్షన్

**-- దరఖాస్తుల పరిశీలన**



**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి)** దోమకొండ మండలం గొట్టిముక్కుల గ్రామంలో చేయూత పెన్షన్లకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పరిశీలించారు. చేయూత పెన్షన్ పరిశీలనలో భాగంగా యాప్ ద్వారా వితంతు పెన్షన్ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్న విధానాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దరఖాస్తుదారుల వివరాలు, సంబంధిత ధ్రువపత్రాల పరిశీలన అనంతరం యాప్‌లో వివరాలను నమోదు చేసి అప్‌లోడ్ చేస్తున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకత పాటిస్తూ, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తుల పరిశీలన, ఆన్‌లైన్ అప్‌లోడ్ ప్రక్రియను నిర్ణీత విధానంలో, వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డి వి ఓ యాప్ ద్వారా వితంతు పెన్షన్ దరఖాస్తుల పరిశీలన, ఆన్‌లైన్ అప్‌లోడ్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

# తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా అధ్యక్షుడిగా ఆకుల మహేందర్ .

**ప్రజా జ్యోతి సెప్టెంబర్ 18 .** తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల జిల్లా కమిటీ నూతన అధ్యక్షుడిగా మండలంలోని భవానిపేట గ్రామానికి చెందిన ఆకుల మహేందర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ఎన్నికల్లో తెలంగాణ సంస్కృతిక సారథి జిల్లా అధ్యక్షుడిగా ఆకుల మహేందర్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది .గౌరవ అధ్యక్షులుగా చిమ్మంజి గారి రమేష్ రావు ఉపాధ్యక్షులుగా గంపల నాగరాజు ప్రధాన కార్యదర్శిగా కమ్మరి చిన్న నాగరాజు సహాయ కార్యదర్శిగా జవ్వశ్రీ కోశాధికారిగా చింతల వారి లత సహాయకులుగా లక్ష్మీనారాయణ, రాములు, తిరుపతి ,శిల్పా, నరేష్ లను ఎన్నుకున్నట్లు తెలిపారు ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఆకుల మహేందర్ మాట్లాడుతూ కళాకారుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు జిల్లాలోని ప్రతి గ్రామంలో ప్రజలందరికీ అవగాహన నిమిత్తం ప్రచారం చేస్తామన్నారు.

# పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ




**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 18(ప్రజా జ్యోతి)** ?పోసానిపేట్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులందరికీ ఉచిత స్కూల్ యూనిఫారమ్‌లను ఘనంగా పంపిణీ చేశారు.?ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుద్దాల లింగం, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ గంగాధర్,వార్డు సభ్యులు,వీడిసి సభ్యులు పాల్గొని విద్యార్థులకు యూనిఫారమ్‌లను అందజేశారు. పాఠశాల హెచ్.ఎం ప్రశాంత్ కుమార్, ఉపాధ్యాయులు శివకృష్ణ , శ్రీనివాసులు, స్కూల్ ఏపీసీ చైర్మన్ కళావతి,నర్సవ్వ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# శెట్పల్లి గ్రామంలో పొలం బడి



**ప్రజా జ్యోతి సెప్టెంబర్ 18 . లింగంపేట్ .** సేద్యం లాభసాటి కావడానికి సాంకేతిక సలహాలు సేంద్రియ ఎరువుల వాడకం సాగు అధ్యయన అంశాలపై క్షేత్ర స్థానంలో వెళ్లి రైతులకు అవగాహన కలిగించడానికి పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి అనిల్ కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని శెట్పల్లి గ్రామంలో స్థానిక సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్ సమక్షంలో రుద్రూర్ వ్యవసాయ వ్యవసాయ శాస్త్రవేత్త రమ్య రాథోడ్ ఆధ్వర్యంలో రైతులకు సమగ్ర సమగ్ర సస్యరక్షణ యాజమాన్యం సమగ్ర పోషక యాజమాన్యం సాధారణ పంట నష్టం పరిమితి పై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త రమ్య రాథోడ్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతులు పంటలు పురుగు యొక్క ఉధృతి అనేది ఎక్కువగా ఉంటేనే సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. సాధారణ పంట నష్టం ఉన్నప్పుడు సస్యరక్షణ చర్యలు తీసుకునే రైతులు నష్టపోకూడదని తెలియజేశారు. రైతులు రసాయనాల వాడకం తగ్గించి సహజ పద్ధతిలో నీమాస్త్రం అగ్ని శాస్త్రం బ్రహ్మాస్త్రం వంటి ద్రావణాలను తయారుచేసుకొని వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులకు నోట్ బుక్స్, క్యాప్ లు,పెన్నులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాజ్యలక్ష్మి ఉపసర్పంచ్ బాలయ్య రైతులు లింగాగౌడ్ ,మల్లయ్య, అంజాగౌడ్, రాములు, కిష్ట గౌడ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆరోగ్య వైద్య శిబిరం డాక్టర్ సురేష్



**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి)** రామారెడ్డి మండల కేంద్రంలోని గోకుల్ తండాలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం గ్రామ సర్పంచ్,గ్రామ పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో జ్వరంతో బాధపడుతున్న సుమారు 15 మంది రోగులకు డెంగ్యూ మరియు మలేరియా రక్త పరీక్షలు నిర్వహించడం జరిగింది. ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, దోమల నియంత్రణ చర్యలపై అవగాహన కల్పించారు. దోమలు వృద్ధి చెందకుండా పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. అలాగే 30 సంవత్సరాలు పైబడిన వారందరికీ రక్తపోటు రక్తంలో చక్కెర పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో కొత్తగా 2 మధుమేహ కేసులు,ల 3 అధిక రక్తపోటు కేసులు గుర్తించడం జరిగింది. కేసుల వివరాలను సంబంధిత ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయడం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్నవారు డా. రమ్య, మంజుల,ఉపసర్పంచ్ రాజేష్ , గ్రామ పంచాయతీ కార్యదర్శి పద్మ ,ఆశా కార్యకర్తలుల గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ శక్తి వినాయక మండపం ప్రతిష్ఠాపన

**ప్రత్యేక పూజలు.. కోలాటాలు, నృత్యాలతో సందడిగా వేడుకలు**



**కామారెడ్డి టౌన్ సెప్టెంబర్ 18 ప్రజా జ్యోతి** కామారెడ్డి మండల కేంద్రంలో శ్రీ శక్తి వినాయక మండపం ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని కాలనీవాసులు గురువారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన శ్రీ శక్తి వినాయక విగ్రహానికి వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు.

ఉదయం నుంచే మండపం వద్ద ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వినాయకుడికి పూజలు, అభిషేకాలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కాలనీవాసులు, యువత, మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని వినాయకుడి ఆశీస్సులు పొందారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు, యువతీ యువకులు సంప్రదాయబద్ధంగా కోలాటాలు ఆడుతూ, నృత్యాలు చేస్తూ సందడి చేశారు. డప్పుల మోతలు, భక్తి గీతాలు, వినాయక నామస్మరణలతో మండపం పరిసర ప్రాంతం మార్మోగింది. చిన్నారులు సైతం ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.ల కాలనీవాసులంతా ఐకమత్యంతో ఉత్సవాలను నిర్వహిస్తూ భక్తి, ఆధ్యాత్మికతతో పాటు సంప్రదాయ కళలను ప్రోత్సహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కూడా వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, యువత, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా మహా అన్నదానం

గణనాథుడి ఆశీస్సులతో భక్తులకు అన్నప్రసాద వితరణ





**బీర్కూర్ , సెప్టెంబర్ 18 (ప్రజాజ్యోతి):** బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మున్నూరుకాపు సంఘం సభ్యులు భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు.

గణేష్ ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ మహా అన్నదాన కార్యక్రమానికి గ్రామ ప్రజలు, గణేష్ భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తిశ్రద్ధలతో గణనాథుడిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సంఘం సభ్యులు సాదరంగా అన్నప్రసాదాన్ని అందించారు.

ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులకు సేవ చేయాలనే ఉద్దేశంతో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్నదానం చేయడం ద్వారా భక్తులకు సేవ చేసే అవకాశం లభించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

గ్రామంలో గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలు ఐకమత్యంతో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేస్తున్నారని పేర్కొన్నారు. మహా అన్నదాన కార్యక్రమానికి సహకరించిన సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, భక్తులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు కర్క శంకర్ ఉపాధ్యక్షులు కొట్టే రాజు కల్ల నారాయణ గణేష్ మండలి నిర్వాహకులు ఎంగాయి సాయి బాబు, పుల్లేని మహేష్, ఎంగాయి శ్రీనివాస్, కల్ల అశోక్, కొట్టే లక్ష్మణ్, కొట్టే గంగాధర్, కొట్టే సునీల్, పుల్లేని రాజు, కొట్టే శ్రీకాంత్ మరియు గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనానికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు

-మొదటిపేజీ తరువాయి

మార్గమధ్యంలో రోడ్ల పరిస్థితి, విద్యుత్ వైర్లు, లైటింగ్, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, బారికేడింగ్ తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కల్కి చెరువు వద్ద నిమజ్జన ప్రాంతంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రెస్క్యూ బృందాలు, గజఈతగాళ్లు, వైద్య సిబ్బందిని ముందుగానే సిద్ధంగా ఉంచాలని సూచించారు. నిమజ్జన సమయంలో ప్రమాదాలు జరగకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

**పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక పూజలు**

బాన్సువాడ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు.

**అధికారులతో భద్రతపై సమీక్ష**

అనంతరం బాన్సువాడ రూరల్ పోలీస్ కార్యాలయంలో సీఐలు, ఎస్ఐలతో గణేష్ ఉత్సవాల భద్రతా ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. శోభాయాత్రలు, నిమజ్జనం సందర్భంగా బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, సున్నిత ప్రాంతాలపై నిఘా తదితర అంశాలపై సమీక్షించారు. పోలీస్, మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు.

డీజేలకు అనుమతి లేదని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, ప్రభుత్వ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని ఎస్పీ స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు, తప్పుడు సమాచారాన్ని నమ్మకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు గణేష్ మండళ్ల నిర్వాహకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర కోరారు

# మల్కాపూర్‌లో ఘనంగా పోషణ్ మాసోత్సవం



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ - 18(ప్రజా జ్యోతి )** ఎల్లారెడ్డి మండలంలోని మాత్తమాల సెక్టర్ పరిధిలోని మల్కాపూర్ అంగన్వాడీ ఆధ్వర్యంలో శుక్రవారం పోషకాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాత్తమల్ సర్పంచ్ కొండా యోగితా మధు, రుద్రారం, అల్మాజీపూర్, మతమాల, జంగమ్మయిపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాల అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు. గర్భవతులకు, బాలింతలకు, సున్నా నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలకు, తల్లులకు పౌష్టికాహారం యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. ముఖ్యంగా తల్లులకు 1000 బంగారు రోజులు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐసీడీఎస్ మతమాల సెక్టర్ సూపర్ వైజర్ స్వప్న మాట్లాడుతూ.. గర్భం దాల్చిన నాటి నుండి పిల్లలకు రెండేళ్లు వచ్చే వరకు గల 1000 రోజులు చాలా కీలకమని, ఈ సమయంలో తీసుకునే పోషకాహారం తల్లీబిడ్డల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని తెలిపారు. సమతుల్య ఆహారం, పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం మల్కాపూర్ సర్పంచ్ కొండ యోగితా మధు గర్భవతులకు శ్రీమంతం కార్యక్రమం నిర్వహించి, పౌష్టికాహారం అందించారు. గ్రామంలో ప్రతి గర్భవతి అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, గర్భవతులు, బాలింతలు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

# శ్రీ శివ గణేష్ మండలి ఆధ్వర్యంలో మహాన్నదానం

కిష్టాపూర్ గంజాయి గల్లీలో ఘనంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు



**బీర్కూర్, సెప్టెంబర్ 18 (ప్రజాజ్యోతి):** బీర్కూర్ మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో గంజాయి గల్లీలో శ్రీ శివ గణేష్ మండలి ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలి సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు మహాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. గ్రామంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు మహాన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గణేష్ మండలి సభ్యులు ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కార్యక్రమాన్ని క్రమబద్ధంగా నిర్వహించారు. మహాన్నదాన కార్యక్రమానికి స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మండలి సభ్యులను అభినందించారు. ప్రతి సంవత్సరం గణేష్ ఉత్సవాల సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని మండలి సభ్యులు తెలిపారు. ఉత్సవాలు శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాన్సువాడ మానేవ్వ గంగొండ, మంద గంగారం, డాక్టర్ శ్రీనివాస్,లింగాపురం రవి,గంజాయి మహేష్, ప్రవీణ్, గంజాయి బాబు, గౌరారం నాందేవ్, గంజాయి శంకర్ మరియు గ్రామ ప్రజలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం

అమర ప్రసాద్ అరెస్టుపై హర్షం వ్యక్తం చేసిన వివిధ సంఘాల నాయకులు



**కామారెడ్డి టౌన్ సెప్టెంబర్ 17 ప్రజా జ్యోతి** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమర ప్రసాద్‌ను పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపిన సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వివిధ సంఘాల ఆధ్వర్యంలో పాలాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేద్కర్ సంఘం, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం, బాంసెఫ్ తదితర సంఘాల నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు కొత్తోల్ల కంగారం మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమర ప్రసాద్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అంబేద్కర్‌పై అవమానకరమైన వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగ విలువలను, సామాజిక న్యాయ స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా ఉంటుందని అన్నారు. భవిష్యత్తులో ఎవరైనా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కామారెడ్డి జిల్లా నుంచి మొదలైన ఆందోళనలు మండలాలు, జిల్లాల స్థాయికి విస్తరించి రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు నిర్వహించినట్లు కంగారం తెలిపారు. ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని అమర ప్రసాద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను కాపాడేందుకు, రాజ్యాంగ పరిరక్షణ కోసం సంఘాలన్నీ ఐక్యంగా పనిచేస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొంగల వెంకటి, అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు ఆకుల బాబు, బాంసెఫ్ రాష్ట్ర అధ్యక్షులు దుబాసి నరేందర్, ఎస్సీ, ఎస్టీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సంఘయ్య, భూపతి, సుధాకర్, ప్రభాకర్, శ్రీనివాస్, మోతె రవి, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు రాజ్యాంగ పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

# స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీపై సమీక్ష సమావేశం



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 18(ప్రజా జ్యోతి )** ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని మిసాన్ పల్లి రైతు వేదికలో శుక్రవారం ఆరు మండలాలు ఎల్లారెడ్డి, లింగంపేట్, నాగిరెడ్డిపేట్, పిట్లం, పెద్దకొడపగల్, నిజాంసాగర్ మండలాలకు చెందిన మండల సిబ్బంది, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు (సీసీ), స్త్రీనిధి సిబ్బంది గ్రామ ఐక్య సంఘాల వీవోఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీడీ విజయలక్ష్మి బ్యాంక్ లింకేజీ పురోగతి, స్త్రీనిధి రుణాల మంజూరు, వసూళ్లు,టాస్ ఫార్మ్, నాన్ ఫార్మ్, స్టిచింగ్ యూనిట్ల పనితీరు,లోకోస్ లో వో ట్రాన్సాక్షన్,ఎంటర్ ప్రైజెస్, బిజినెస్ యాక్టివిటీస్ అంశాలపై వీవోఏ వారీగా వివరంగా రివ్యూ చేసి, లక్ష్యాల సాధనకు కమిట్మెంట్ తీసుకోవడం జరిగింది. సభ్యుల ఆదాయం పెంపునకు నాన్ ఫార్మ్, ఫార్మ్ రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం ఐబీ డీపీఎం శ్రీనివాస్, బీఎల్ డీపీఎం రాజయ్య, నాన్ ఫామ్ డీపీఎం సాయిలు, ఎల్ హెచ్ డీపీఎం సురేష్, ఎస్ ఏ రామ్ కిరణ్, సన్ మేనేజర్లు పాల్గొని మండలాల వారీగా పురోగతిని సమీక్షించారు. అలాగే ఆరు మండలాల ఏపీఎంలు రాంనారాయణ గౌడ్, ప్రసన్న రాణి, వినోద్, గంగారాం, దత్తు, సాయిలు,సీసీలు, బిట్స్ పిలాని వినోద్ సార్, అకౌంటెంట్ మహేష్ వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

# ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం తనిఖీ

-- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్



**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి)** కామారెడ్డి జిల్లా ముత్యంపేట ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ వైద్య సేవలతో పాటు పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి అన్నారు.జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ దోమకొండ మండలం ముత్యంపేట గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం ను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, ఔషధాల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల తీరుపై జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందేలా నిరంతరం పర్యవేక్షించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు వచ్చే ప్రతి ఒక్కరికీ సకాలంలో అవసరమైన వైద్య సేవలు, మందులు అందేలా సిబ్బంది. బాధ్యతతో పనిచేయాలి అని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. ఆస్పత్రి ప్రాంగణం, స్టోర్ రూమ్‌ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. వైద్య సేవలు అందించే ప్రదేశంలో పరిశుభ్రత అత్యంత ముఖ్యమైనది. ఆస్పత్రి పరిసరాలు ఆహ్లాదకరంగా స్వచ్ఛంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి అని సూచించారు. ఔషధాల నిల్వలను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, రోగులకు సకాలంలో మందులు పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల పై నమ్మకంతో వచ్చేలా సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలి. ప్రతి రోగితో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చూడాలి. అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ తనిఖీ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్ వై గిరి, డిఎం మెన్ హెచ్ ఓ వెంకట్, సర్పంచ్ స్థానిక వైద్య అధికారులు, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు ఒక వరం

ఎంపీడీవో శ్రీనిధి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇంటి ప్రారంభం



బీర్కూర్, సెప్టెంబర్ 18 (ప్రజాజ్యోతి): నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం వారికి ఒక వరం లాంటిదని బీర్కూర్ ఎంపీడీవో శ్రీనిధి అన్నారు. శుక్రవారం బీర్కూర్ మండల కేంద్రంలో నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ఎంపీడీవో శ్రీనిధి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనిధి మాట్లాడుతూ ఇంటి స్థలం కలిగి ఉన్న అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రభుత్వం రూ.5 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. సొంత ఇల్లు లేని పేద కుటుంబాలకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. బీర్కూర్ మండలానికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు వేగవంతం చేసి, ప్రభుత్వం నిర్దేశించిన విధంగా పనులను పూర్తి చేసుకోవాలని సూచించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి సమస్యలు ఎదురైనా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆమె తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ప్రతి లబ్ధిదారుడు సొంతింటి కలను సాకారం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనిధి కోరారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయితే పేద కుటుంబాలకు శాశ్వత నివాస సౌకర్యం లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యమ రాములు, ఉప సర్పంచ్ పరమేశ్వరరావు, శశికాంత్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు రఫీ, వార్డు మెంబర్ ఖాజా ఖాన్, రఘు, మహేష్, ప్రశాంత్, రియాజ్, హన్మంత్రావు తదితరులు పాల్గొన్నారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికలకు ఓటర్ల జాబితా సిద్ధం



**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి)** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ కార్యవర్గ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను జిల్లాలోని అన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు తహశీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచినట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఎన్నికల పరిశీలకులు ఎన్. వై. గిరి తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులందరూ తమకు సమీపంలోని ఎంపీడీవో లేదా తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటర్ల జాబితాలో తమ పేరు, ఇతర వివరాలను సరిచూసుకోవాలని సూచించారు. జాబితాలో ఏవైనా అభ్యంతరాలు లేదా తప్పులు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 19న ఓటర్ల జాబితా ప్రచురణతో పాటు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 24న నామినేషన్ల స్వీకరణ, సెప్టెంబర్ 25న నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 26న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించడంతో పాటు పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల పోలింగ్ తేదీ ను తాత్కాలికంగా అక్టోబర్ 4వ తేదీగా నిర్ణయించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# నిజామాబాద్ ప్రెస్ క్లబ్ వద్ద ఘనంగా అన్నదానం

**జర్నలిస్టులు సామాజిక సేవల్లో భాగస్వాములు కావడం అభినందనీయం: టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు రజినీకాంత్**



**కామారెడ్డి టౌన్ సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి)** నిజామాబాద్ పట్టణంలోని ప్రెస్ క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శుక్రవారం 'మనం' దినపత్రిక ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జి. సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు, పాత్రికేయులు, స్థానికులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కామారెడ్డి జిల్లా టీయూడబ్ల్యూజే అధ్యక్షులు రజినీకాంత్ హాజరయ్యారు. ముందుగా వినాయకుడి మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులతో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా రజినీకాంత్ మాట్లాడుతూ 'మనం' దినపత్రిక ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జి. సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. జర్నలిస్టులు కేవలం వార్తల సేకరణ, ప్రచురణకే పరిమితం కాకుండా సమాజ శ్రేయస్సు కోసం చేపట్టే సేవా కార్యక్రమాల్లో కూడా భాగస్వాములు కావడం సంతోషకరమని పేర్కొన్నారు. వినాయక ఉత్సవాల సందర్భంగా అన్నదానం నిర్వహించడం ద్వారా భక్తులకు, ప్రజలకు సేవ చేసే అవకాశం లభిస్తుందని అన్నారు. దైవభక్తితో పాటు సేవాభావాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు. జర్నలిస్టులు ఐక్యతతో ముందుకు సాగుతూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను కూడా కొనసాగించాలని ఆకాంక్షించారు. సమాజంలో సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత పెరగాల్సిన అవసరం ఉందని, అన్నదానం వంటి కార్యక్రమాలు ప్రజల్లో పరస్పర సహకారం, సేవాభావం పెంపొందించేందుకు దోహదపడతాయని రజినీకాంత్ పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ జర్నలిస్టుల ఐక్యతతో మరిన్ని సామాజిక, సేవా కార్యక్రమాలను నిర్వహించాలని ఆయన కోరారు. అన్నదాన కార్యక్రమంలో 'మనం' దినపత్రిక ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జర్నలిస్టు బృందం సభ్యులు, వారి కుటుంబ సభ్యులు, పలువురు పాత్రికేయులు, ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా భక్తులకు నిర్వాహకులు అన్నప్రసాదాన్ని అందించారు.

# గణేష్ విగ్రహ దాతకు సన్మానం



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 18(ప్రజా జ్యోతి )** ఎల్లారెడ్డి పట్టణంలోని సూర్య విహార్ కాలనీలో ఏర్పాటు చేసిన గణేష్ కమిటీ మొదటి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్ గౌడ్ కు కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించారు. కాలనీలో గణేష్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు విగ్రహాన్ని అందించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డు కౌన్సిలర్ అట్కూరి చంద్రయ్య, గణేష్ కమిటీ సభ్యులు, సూర్య విహార్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

# కొత్త పెన్షన్ దరఖాస్తుదారులకు సర్వే



**కామారెడ్డి టౌన్ సెప్టెంబర్ 17 ప్రజా జ్యోతి** కామారెడ్డి మండలం రాఘవపూర్ గ్రామంలో కొత్తగా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారుల వివరాలను సేకరించేందుకు శుక్రవారం సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హతకు సంబంధించిన సమాచారాన్ని నమోదు చేశారు. ఈ సందర్భంగా దరఖాస్తుదారుల కుటుంబ పరిస్థితులు, సంబంధిత వివరాలను పరిశీలించి సర్వే ప్రక్రియను పూర్తి చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం అందేలా అధికారులు, గ్రామపంచాయతీ పాలకవర్గం సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు సర్వే బృందానికి అవసరమైన వివరాలు అందించి సహకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎడ్ల వీనిల నరేష్, ఉప సర్పంచ్ నరేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి మాధవి లత, స్పెషల్ ఆఫీసర్ పవన్, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ దరఖాస్తుదారుల సర్వే.. ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

-మొదటిపేజీ తరువాయి

కామారెడ్డి మండల ఎంపీడీవో హేబ్సిబా రాణి సర్వే, ఇందిరమ్మ ఇళ్ల తనిఖీ ప్రక్రియను పరిశీలించారు. గ్రామస్థాయిలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కారోబార్, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త పెన్షన్లకు క్షేత్రస్థాయి పరిశీలన



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ -18(ప్రజా జ్యోతి )** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కొత్త పెన్షనలలో భాగంగా కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపడుతున్నట్లు ఎంపీడీఓ తాహెరా బేగం తెలిపారు. గురువారం మండలంలోని సిబ్బందితో కలిసి దరఖాస్తులు చేసుకున్న వారి దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కొత్త పెన్షన్ల కోసం వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిశీలించి అర్హుల జాబితాను రూపొందిస్తామని అన్నారు. సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారుల అర్హతను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, ఒంటరి మహిళా పెన్షన్లకు సంబంధించి ఎటువంటి అనర్హులకు అవకాశం ఇవ్వకుండా పారదర్శకంగా వ్యవహరిస్తామని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని, దరఖాస్తుల పరిశీలనలో నిర్లక్ష్యం వహించడానికి అవకాశం ఉండాదాని పేర్కొన్నారు. అనర్హులను గుర్తిస్తే వెంటనే తొలగించాలని స్పష్టం చేశారు.

దరఖాస్తుదారుడి నిజమైన గుర్తింపు, నివాస స్థితి, సామాజిక, ఆర్థిక పరిస్థితులు, కోరుతున్న పెన్షన్ క్యాటగిరీతోపాటు నిర్దేశించిన ఇతర అర్హతలను పరిశీలించమన్నారు. వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత దరఖాస్తుదారుడు అర్హుడా? అనర్హుడా? అనే విషయాన్ని మొబైల్ యాప్‌లో స్పష్టంగా నమోదు చేస్తామన్నారు. అనర్హుడిగా తేలితే అందుకు గల నిర్దిష్ట కారణాన్ని తప్పనిసరిగా నమోదు చేస్తామని తెలిపారు. వెరిఫికేషన్‌ను ఈ నెల 25లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు విధించిందని, వెరిఫికేషన్ పూర్తయిన వెంటనే అర్హులైన లబ్ధిదారుల జాబితాను సంబంధిత డీఆర్‌డీవోలకు పంపించడం జరుగుతుందని ఎంపీడీఓ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

# స్వయం పాలన అందించిన ఘనత కెసిఆర్ దే.

**ప్రజా జ్యోతి, సెప్టెంబర్ 18.** తెలంగాణ రాష్ట్రంలో గిరిజనుల చిరకాల ఆకాంక్షలను గుర్తించి తండాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి గిరిజన తండాలకు స్వయం పాలన అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కి దక్కుతుందని నల్లమడుగు తాండ మాజీ సర్పంచ్ రవీందర్ నాయక్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డి మాజీ శాసనసభ సభ్యుడు జాజాల సురేందర్ ఆదేశాల మేరకు తండాలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చిన్న చిన్న తండాలను సైతం ప్రత్యేక గ్రామపంచాయతీలుగా మార్చడం వల్ల గిరిజనులు తమ సొంత గ్రామాల్లో సర్పంచులుగా ప్రజాప్రతినిధులుగా ఎదిగే అవకాశం లభించింది అన్నారు ఎస్టిలకు ఉన్న 6 శాతం రిజర్వేషన్లు 10 శాతానికి పెంచి ఉద్యోగ ఉపాధి రంగాలలో కెసిఆర్ కుటుంబాల్లో వెలుగు నింపారని గుర్తు చేసుకున్నారు తండాలను పంచాయతీలుగా మార్చడమే కాకుండా గిరిజన గురుకులాలు పోడు భూముల సమస్యల పరిష్కారం ,మౌలిక వసతుల కల్పనకు గత ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని కొనియాడారు పీర్ ఏక్ బార్ కెసిఆర్ సర్కార్ ప్రయోగం అన్నారు .నాయకులు ఈశ్వర్ సంగమేష్ నాయక్, దేవేందర్ కిషన్, బీమ్ సింగ్ , జవహర్‌లాల్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల చోరీల ముఠా గుట్టురట్టు

-మొదటిపేజీ తరువాయి

మాసాల బంగారు పుస్తెల బిళ్లలు, ఐదు తులాల వెండి చైన్, ఒక తులం బరువున్న రెండు వెండి మెట్టెలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గాంధారి మల్లన్న ఆలయం నుంచి చోరీ చేసిన మూడు తులాల వెండి మాసాలు, రెండు గ్రాముల బంగారు పుస్తెల తాడు, రెండు వెండి కళ్లను రికవరీ చేశారు. బుగ్గమేశ్వరం ఆలయం నుంచి చోరీ చేసిన నగదును కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కన్కల్ రామాలయం నుంచి చోరీ చేసిన నగదు, మొబైల్ ఫోన్‌తో పాటు నందిపేటలో చోరీకి గురైన ప్యాషన్ బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసుల ఛేదనలో కీలకంగా పనిచేసిన సీఐ ఎస్.వీరయ్య, గాంధారి ఎస్ఐ ఎం.మహేందర్, కానిస్టేబుళ్లు సంజయ్, శ్యామ్, ఇతర సిబ్బందిని కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర అభినందించారు. అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

# నిట్ ఫలితాలలో ఆణిముత్యాలు




**కామారెడ్డి ప్రతినిధి సెప్టెంబర్ 18(ప్రజా జ్యోతి)** నిట్ ఫలితాల లో రామారెడ్డి మండల కేంద్రానికి చెందిన విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించడం జరిగింది. ప్రభుత్వం ఫలితాలు వెలువరించిన సందర్భంగా మెరిట్ ర్యాంక్స్ సాధించిన ఇద్దరు విద్యార్థులకు గ్రామ ప్రజలు ఘనంగా శుభాకాంక్షలు తెలపడం జరిగింది. రామారెడ్డి గ్రామంలోని బత్తిని గోవర్ధన్ రెండవ కుమారుడు రోహన్ స్టేట్ ర్యాంక్ 2694 సాధించగా, దొంతుల దశరథ్ కూతురు సాగరిక స్టేట్ 4221 ర్యాంక్ సాధించి ఎంబిబిఎస్ లో ఫ్రీ సీట్ అలాట్మెంట్ సాధించడం జరిగింది. ఈ సందర్భంగా వారి తల్లిదండ్రుల కళలను సహకారం చేసినందుకు గాను గర్వంగా సంతోషపడటం జరిగింది. అదేవిధంగా ఇతర విద్యార్థులకు ఆదర్శనంగా నిలుస్తారని గ్రామస్తులు కొనియాడారు వీరి విజయం గ్రామానికి ఆదర్శమని రామారెడ్డి పద్మశాలి సంఘం అధ్యక్షులు దోమల శ్రీధర్ శుభాకాంక్షలు తెలపడం జరిగింది.

# హమారా ప్రసాద్‌పై ఒకే రోజు 20 ఫిర్యాదులు



**ప్రజా జ్యోతి సెప్టెంబర్ 18.** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్ అలియాస్ నాగులాపురం వరప్రసాద్ పై దళిత సంఘాల జయంతి యాక్షన్ కమిటీ జేఏసీ కామారెడ్డి జిల్లా పిలుపుమేరకు మండలంలోని వివిధ గ్రామాల దళిత యువజన సంఘాల ప్రతినిధులు 20 మంది వేరువేరుగా గురువారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు రాష్ట్ర కార్యదర్శి లెగ్గల రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు గాంధీని గాడ్సే చంపినట్లు ఒకవేళ ఇప్పుడు అంబేద్కర్ బ్రతికి ఉంటే నేను కూడా కాల్చి చంపే వాళ్ళని అంటూ హమారా ప్రసాద్ ప్రపంచ మేధావి భారత రాజ్యాంగం నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కించపరుస్తూ అంబేద్కర్ కల్పిత నాయకుడు అని రాజ్యాంగ రచన అంబేద్కర్ చేయలేదని అంబేద్కర్ గారి పై అనుచిత వాఖ్య వ్యాఖ్యలు చేస్తూ భారత రాజ్యాంగాన్ని కించపరుస్తూ భారతదేశ ప్రజల మధ్య కులం మతం జాతుల మధ్య చిచ్చుపెట్టి రెచ్చగొట్టేలా శాంతిభద్రతలకు విగాథం కలిగించేలా భారత రాజ్యాంగం నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అవమాన పరుస్తూ మాట్లాడిన హమారా ప్రసాద్ పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని అంబేద్కర్ పైన హమారా ప్రసాద్ రాసిన పుస్తకం ప్రచురణ ప్రచురణ ఆవిష్కరణ కాకుండా పుస్తకం రద్దు చేయాలని పోలీస్ స్టేషన్లో మండల అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సై సేల్ అధ్యక్షుడు సాయిలు డివిజన్ కార్యదర్శి జీవన్ నాయకులు సాయిరాం మూతి రవి, భూమయ్య బాలరాజు సాయికుమార్ రాజు కిషన్ నర్సింలు భూపతి తదితరులు పాల్గొన్నారు.

# దాత సహాయంతో విద్యార్థులకు సైకిళ్లు, క్రీడా సామగ్రి పంపిణీ



**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 18:(ప్రజా జ్యోతి )** ఎల్లారెడ్డి మండలం అడవిలింగాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ఆనంద విజ్ఞాన నిలయం) విద్యార్థులకు అడవిలింగల్ గ్రామానికి చెందిన దాత పెరిక హరికృష్ణ - చండీప్రియ దంపతులు విద్యార్థులకు సైకిళ్లు, క్రీడా సామాగ్రిలను వితరణ చేశారు. ఒక మంచి మనసు ఒక విద్యార్థి భవిష్యత్తును మార్చగలదు అనే నినాదంతో గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దాత పెరిక హరికృష్ణ ఆధ్వర్యంలో, తన తల్లి కీ.శే. పెరిక భాగ్యవతి స్మారకార్థం సందర్భంగా గురువారం పాఠశాలలో సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గత రెండేళ్లుగా విద్యార్థులకు స్టడీ చైర్స్, స్కూల్ బ్యాగులు, షూస్, వాటర్ బాటిల్స్ అందజేసిన హరికృష్ణ, ఈ ఏడాది విద్యార్థులకు హౌస్ వైజ్ టీ-షర్ట్స్, ట్రౌజర్స్, వాలీబాల్ తదితర క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ముఖ్యంగా 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ప్రతి తరగతిలో ప్రథమ ర్యాంక్ సాధించిన విద్యార్థులకు ప్రత్యేకంగా సైకిళ్లను బహూకరించి ప్రోత్సహించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపడంతో పాటు చదువు, క్రీడల్లో ముందుండాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. దాత పెరిక హరికృష్ణ చేస్తున్న సేవలను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. ఈ సేవా కార్యక్రమం ఇతర దాతలకు స్ఫూర్తిగా నిలుస్తుందని, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అందరూ ముందుకు రావాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివ అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంఈఓ రాజులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిల్లలమర్రి శివ నరసింహారావు, ఉపాధ్యాయులు బి.విజయ్ కుమార్, పి. సిద్ధిరామ్ గౌడ్, జె. రమేష్, జి. శ్రీధర్, ఏ. మురళీమోహన్, చిన్న గంగారం, రాజమణి, ఎన్. విజయ్ కుమార్, స్వప్న, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, గ్రామ, విద్యార్థులు పాల్గొన్నారు.

# వృద్ధ మహిళ అదృశ్యం.. ఆచూకీ కోసం పోలీసుల గాలింపు

**ఆచూకీ తెలిస్తే దేవునిపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి**



**కామారెడ్డి, టౌన్ సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి)** దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ వృద్ధాశ్రమం నుంచి ఓ వృద్ధ మహిళ అదృశ్యమైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వృద్ధ మహిళ ఆచూకీ కోసం దేవునిపల్లి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 18వ తేదీ ఉదయం సుమారు 8 గంటల సమయంలో దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రభుత్వ వృద్ధాశ్రమం నుంచి సదరు వృద్ధ మహిళ బయటకు వెళ్లారు. అనంతరం ఆమె తిరిగి వృద్ధాశ్రమానికి రాకపోవడంతో నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు వెంటనే స్పందించి ఆమె ఆచూకీ కోసం గాలింపు ప్రారంభించారు. అదృశ్యమైన వృద్ధ మహిళకు సంబంధించిన ఫోటో, ఇతర గుర్తింపు వివరాలను పోలీసులు విడుదల చేశారు. ఆమెను ఎక్కడైనా చూసినట్లయితే లేదా ఆమె ఆచూకీకి సంబంధించి ఏదైనా సమాచారం తెలిసినట్లయితే ఆలస్యం చేయకుండా దేవునిపల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. వృద్ధ మహిళ ఆచూకీ గుర్తించేందుకు ప్రజలు తమకు తెలిసిన సమాచారాన్ని పోలీసులతో పంచుకోవాలని సూచించారు. ముఖ్యంగా పరిసర ప్రాంతాల్లో ఆమె కనిపించినట్లయితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మీడియా మిత్రులు ఈ సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం చేసి వృద్ధ మహిళను సురక్షితంగా గుర్తించడంలో పోలీసులకు సహకరించాలని దేవునిపల్లి పోలీసులు కోరారు.

## పోషకాహార లోపాలపై అవగాహన

గర్భిణీలు, బాలింతలకు పోషణపై సూచనలు



**గాంధారి, సెప్టెంబర్ 18 (ప్రజాజ్యోతి)** గాంధారి మండలంలోని నేరల్ గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహార ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. పోషకాహార లోపాలతో ఎదురయ్యే సమస్యలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణీలకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం చేపట్టారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారం తీసుకోవాలని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ప్రాజెక్టు అధికారి పద్మ, సీడీపీఓ, ఏసీడీఎస్ సూపర్‌వైజర్లు వినోదిని, ఆర్తి, గ్రామ సర్పంచ్ దేవిసింగ్, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.నేరల్ సెక్టార్ నుంచి సర్వాపూర్ సెక్టార్‌కు బదిలీ అయిన సూపర్‌వైజర్ వినోదినికి అంగన్‌వాడీ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. నేరల్ సెక్టార్‌లో ఆమె అందించిన సేవలను ఈ సందర్భంగా సిబ్బంది గుర్తుచేసుకున్నారు.

## విద్యార్థులకు యూనిఫాంలు, షూల పంపిణీ



**కామారెడ్డి టౌన్ సెప్టెంబర్ 18 ప్రజా జ్యోతి** కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం అందించిన యూనిఫాంలు, షూలను విద్యార్థులకు శుక్రవారం పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అందిస్తున్న పాఠశాల సామగ్రిలో భాగంగా యూనిఫాంలు, షూలను విద్యార్థులకు అందజేశారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చిందం మల్లేష్, ఉప సర్పంచ్ సిద్ధం స్వామి విద్యార్థులకు యూనిఫాంలు, షూలను అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని వారు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఉపాధ్యాయులు వేద, రంజిత, జ్యోతి కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు మల్లీ, మనవ్వ, అజీజ్, సంతోష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రవీందర్ రావు, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు యూనిఫాంలు, షూలు అందడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు

## కలిగోట్ సంఘ భవనాల నిర్మాణానికి రూ.10లక్షలు

ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి చేతుల మీదుగా ప్రొసీడింగ్స్ అందుకున్న సంఘం సభ్యులు

నిధులు మంజూరు పట్ల హర్షం



**నిజామాబాదు రూరల్, ప్రజా జ్యోతి** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించడం జరుగుతుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జక్రాన్ పల్లి మండలం కలిగోట్ గ్రామంలో రెడ్డి సంఘ భవన నిర్మాణానికి రూ. 5 లక్షలతో పాటు ఎస్సీ( మాదిగ ) సభ భవన నిర్మాణానికి రూ.5 లక్షల నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్స్ ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారికి అందజేశారు. అన్ని వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపిన ఎమ్మెల్యే .. గ్రామస్తులు అందరి సమిష్టిగా ఉంటూ.. గ్రామాభివృద్ధిలో ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రాజు నాయక, రెడ్డి సంఘం వాకిటి పెద్ద భోజన్న, ఎస్సీ సంఘం గంగాధర్, అల్లూరి శ్రీనివాస్, లింబాద్రి, సాయి రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యను సన్మానించిన గడ్కోల్ గ్రామపంచాయతీ పాలకవర్గం




**సిరికొండ, ప్రజా జ్యోతి** సిరికొండ మండల కేంద్రంలోని గడ్కోల్ గ్రామంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న రాజకీయ శిక్షణ తరగతులకు విచ్చేసిన ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యను గడ్కోల్ గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ పాలకవర్గం సన్మానించడం జరిగింది ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ యువత రాజకీయాల్లో ఉత్సాహంగా పనిచేయాలని అలాగే ఎలాంటి ఆడంబరాలకు వెళ్లకుండా ప్రజలకు సేవ చేయాలని గత 25 సంవత్సరాలు ఎమ్మెల్యేగా ప్రజాసేవలో ఉండి ప్రజల కోసం పోరాటం చేశానని అలాగే యువత నూతనంగా ఎన్నుకోబడ్డ సర్పంచులు పీడిత ప్రజల కోసం పోరాటం చేసి ప్రభుత్వం నుంచి రావాల్సిన సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఆయన సర్పంచులకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంద్ర లతా శంకర్, ఉప సర్పంచ్ రొక్కం సంపత్ రెడ్డి, వార్డ్ మెంబర్ తలారి హేమంత్ పంచాయతీ కార్యదర్శి తిరుపతి కారోబార్ గంగామణి సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాసిన నాయకులు పాల్గొన్నారు

## నర్సింగ్ పల్లి గ్రామంలో వికలాంగుడికి చార్జింగ్ సైకిల్ అందజేత



**సిరికొండ, ప్రజా జ్యోతి** సిరికొండ మండలంలోని నర్సింగ్ పల్లి గ్రామంలో డాక్టర్ భూపతి రెడ్డి కృషి వలన చార్జింగ్ సైకిల్ ఉందని సర్పంచ్ తెడ్డు సుగుణ రాజేశ్వర్ గ్రామానికి చెందిన మాదా నర్సింగ్ రావు నూతన చార్జింగ్ సైకిల్ ను అందజేశారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రావణ్ కుమార్ పంచాయతీ కార్యదర్శి పాషా, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కాయిత ప్రశాంత్ ఈ సందర్భంగా లబ్ధిదారులు మాదా నర్సింగరావు మాట్లాడుతూ వికలాంగులకు ఎంతో ప్రోత్సహిస్తూ అండగా ఉంటున్న సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే భూపతిరెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు

## వ్యవసాయ మార్కెట్ కమిటీచైర్మన్ ముప్ప గంగారెడ్డి పదవి కాలం పొడగించాలని ఎమ్మెల్యేకు కార్మికుల వినతి



**నిజామాబాదు రూరల్, ప్రజా జ్యోతి** పనిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా కొనసాగుతున్న ముప్ప గంగారెడ్డి పదవి కాలం పొడగించాలని కోరుతూ..వ్యవసాయ మార్కెట్ యార్డు గుమస్తా దడువాయి, ముల్లె హమాలీ, ఛాయా యూనియన్ నాయకులు శుక్రవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డిని కలిశారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేసి మాట్లాడుతూ.. వ్యవసాయ మార్కెట్ పరిధిలో రైతు, కార్మికుల సంక్షేమం, అభివృద్ధి పట్ల ప్రస్తుత ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డికి అపారమైన అనుభవం ఉన్న నేపథ్యంలో ఆయన సేవలను కొనసాగించాలని కోరారు. రైతులకు, వ్యాపారులకు ప్రయోజనం చేకూరాలంటే ఆయన పదవి కాలం పొడగించాలని.. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో దాడువై ప్రెసిడెంట్ నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్, గుమస్తా సంఘం అధ్యక్షుడు బాల ఆంజనేయులు , సెక్రటరీ గట్ల శ్రీనివాస్ , జాయిట్ సెక్రటరీ శివ కుమార్ , చాట సంఘం అనసూయ గణేష్ , ముల్లె సంఘం వెంకటి రాము తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మల శివారులో గంజాయి సాగు భగ్నం

– రూ.12 లక్షల విలువైన 400 గంజాయి మొక్కలు స్వాధీనం




**గాంధారి సెప్టెంబర్ 18.(ప్రజాజ్యోతి )** గాంధారి మండలం తుమ్మల గ్రామ శివారులో అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి పంటను పోలీసులు భగ్నం చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు గాంధారి పోలీసులు వ్యవసాయశాఖ అధికారి సమక్షంలో తనిఖీలు నిర్వహించారు. పత్తి పంటలో అంతర పంటగా గంజాయి మొక్కలను సాగు చేస్తున్నట్లు గుర్తించారు. సుమారు 400 పచ్చి గంజాయి మొక్కలను వేర్లతో సహా తొలగించి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కల విలువ సుమారు రూ.12 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మంజ సోనుసింగ్, మంజ మద్దిబాయి భార్యాభర్తలు కాగా, బస్సి జోద్రాజ్ మరో నిందితుడిగా పోలీసులు గుర్తించారు. మొదటి ఇద్దరు కౌలుకు తీసుకున్న భూమిలో సుమారు 250 గంజాయి మొక్కలను సాగు చేసినట్లు తెలిపారు. మరో నిందితుడు కౌలుకు తీసుకున్న భూమిలో సుమారు 150 గంజాయి మొక్కలను సాగు చేసినట్లు వెల్లడించారు. అధిక డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో పత్తి పంటలో గంజాయి సాగు చేసినట్లు విచారణలో తేలింది. గంజాయి సాగులో సంభాషణలకు ఉపయోగించిన మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల పాత్రపై పోలీసులు మరింత లోతుగా విచారణ కొనసాగిస్తున్నారు. కేసు వివరాలను ఎల్లారెడ్డి డీఎస్పీ ఎస్. శ్రీనివాస్‌రావు వెల్లడించారు. గంజాయి సాగు, రవాణా, విక్రయం, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు

## గణపతి పూజలో పాల్గొన్న సీఐ, ఎస్సై





**ఎల్లారెడ్డి , సెప్టెంబర్ 18(ప్రజా జ్యోతి )** పట్టణంలో గాంధీ చౌక్ వద్ద భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి పూజా కార్యక్రమంలో సీఐ రాజారెడ్డి, ఎస్సై రాజు పాల్గొన్నారు.వినాయకుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, శాంతిభద్రతల పరిరక్షణ కోసం, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా సీఐ రాజారెడ్డి మాట్లాడుతూ, గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, నిబంధనలకు అనుగుణంగా జరుపుకోవాలని ప్రజలకు సూచించారు. అనంతరం ఎల్లారెడ్డి భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నశాంతి కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భజరంగ్ దళ్ సభ్యులు, ప్రజాప్రతినిధులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులే దేశానికి వెన్నెముక

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి–తహసీల్దార్ రేణుక చౌహన్



**గాంధారి, సెప్టెంబర్ 18 (ప్రజాజ్యోతి )** విద్యార్థులే దేశానికి వెన్నెముక అని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో చదివితే ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చని గాంధారి తహసీల్దార్ రేణుక చౌహన్ అన్నారు. శుక్రవారం గాంధారి మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు ప్రత్యేక స్ఫూర్తిదాయక తరగతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ విద్యార్థులతో మమేకమై పలు విషయాలను వివరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ, సమయపాలన, లక్ష్య సాధనపై దృష్టి సారించాలన్నారు. చదువు కేవలం పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకే కాకుండా బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి ఉపయోగపడాలని సూచించారు. జీవితంలో ఎదురయ్యే కష్టాలను చూసి వెనకడుగు వేయకుండా వాటిని అవకాశాలుగా మలచుకుని ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. తన అనుభవాలను వారితో పంచుకుంటూ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారు.అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తహసీల్దార్ రేణుక చౌహన్‌ను సత్కరించారు. అధికారుల ఆధ్వర్యంలో ఇలాంటి ప్రేరణాత్మక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నూతన ఉత్సాహం పెరుగుతుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం ఈ ఓ శ్రీహరి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# గన్నారం ఎస్సీ కాలనీలో వినాయక చవితి వేడుకలు

రూ.100 లక్కీ డ్రాతో 50 కిలోల యూరియా బహుమతి



**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) సెప్టెంబర్. 18** ఇందల్వాయి: మండల కేంద్రంలోని గన్నారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో వినాయక చవితి సందర్భంగా యువత ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ తన సొంత ఖర్చులతో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, భక్తులు మరియు గ్రామ ప్రజల కోసం రూ.100 లక్కీ డ్రా కూపన్లను ఏర్పాటు చేశారు. ఈ లక్కీ డ్రాలో పాల్గొనే వారికి 50 కిలోల యూరియా బస్తాను బహుమతిగా అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం యూరియా కొరత, ధరల నేపథ్యంలో రైతులకు ఉపయోగపడేలా ఈ బహుమతిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మహేష్ తన సొంత ఖర్చులతో వినాయకుడిని ఏర్పాటు చేయడమే కాకుండా, లక్కీ డ్రా కార్యక్రమాన్ని కూడా నిర్వహించడంపై స్థానిక యువత, ప్రజలు అభినందనలు తెలిపారు. యువత పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొని లక్కీ డ్రా నిర్వహణకు సహకరించారు. రూ.100 కూపన్‌తో లక్కీ డ్రాలో పాల్గొని 50 కిలోల యూరియా బహుమతిని సొంతం చేసుకునే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. ఇందల్వాయి మండల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని మహేష్ మరియు యువత కోరారు.

# మాట ఇచ్చారు.. నిలబెట్టుకున్నారు.

మహాలక్ష్మి ఆలయ రేకుల షెడ్డు నిర్మాణానికి రూ.లక్ష విరాళం

గ్రామ సర్పంచ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కందగట్ల రాంచందర్ (అన్నాసేట్) ఔదార్యం.



**ఎడపల్లి, సెప్టెంబర్ 18 (ప్రజాజ్యోతి):** ఇచ్చిన మాటకు కట్టుబడి ఎడపల్లి గ్రామ సర్పంచ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కందగట్ల రాంచందర్ (అన్నాసేట్) మరోసారి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. ఎడపల్లి మండల కేంద్రంలోని శ్రీ మహాలక్ష్మి మందిరం వద్ద రేకుల షెడ్డు నిర్మాణం కోసం గురువారం మహాలక్ష్మి ఉత్సవ కమిటీకి రూ.లక్ష నగదును విరాళంగా అందజేశారు. గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యుల సమక్షంలో ఈ మొత్తాన్ని అందించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని గతంలో ఇచ్చిన హామీ మేరకు ఈ విరాళాన్ని అందించినట్లు తెలిపారు. ఆలయ పరిసరాల్లో భక్తులకు, ఉత్సవాల సందర్భంగా వచ్చే ప్రజలకు సౌకర్యంగా ఉండేలా షెడ్డు నిర్మాణం చేపట్టడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎడపల్లి సింగిల్ విండో చైర్మన్ పోలా మల్కారెడ్డి, నాయకులు కామప్ప, న్యావనంది సుభాష్, వెంకట్‌రెడ్డి, వార్డు సభ్యులు దండి శంకర్, బర్దీపూర్ విఠల్, నాయకులు మల్లెపూల శ్రీనివాస్, భట్టు రాజు, మహాలక్ష్మి ఉత్సవ కమిటీ అధ్యక్షులు భట్టు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎడపల్లిలో చోరీ కలకలం.

**రెండు ఇళ్ల తాళాలు పగులగొట్టి బంగారం, వెండి అపహరణ.**

**ఎడపల్లి, సెప్టెంబర్ 18 (ప్రజాజ్యోతి):** ఎడపల్లి గ్రామంలో గుర్తుతెలియని దొంగలు తాళాలు పగులగొట్టి రెండు ఇళ్లలో చోరీకి పాల్పడిన ఘటన కలకలం రేపింది. బాధితురాలు నాజియా బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎడపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఫిర్యాదు వివరాల ప్రకారం.. ఎడపల్లి గ్రామంలోని సాయి కృపా నగర్‌కు చెందిన నాజియా బేగం సెప్టెంబర్ 11న సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో తన తల్లి నివసించే నీలా పేపర్ మిల్ గ్రామానికి వెళ్లారు. ఇదే సమయంలో ఆమె ఇంట్లో అద్దెకు ఉంటున్న సయ్యద్ మాజిద్ కూడా ఇంటికి దూరంగా ఉన్నారు. సెప్టెంబర్ 17న రాత్రి సుమారు 10 గంటలకు మాజిద్ ఇంటికి వచ్చి చూడగా రెండు ఇళ్ల తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గుర్తించాడు. దొంగలు ఇళ్లలోకి ప్రవేశించి బీరువాల తాళాలు పగులగొట్టి, వస్తువులను చిందరవందరగా పడేసినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న నాజియా బేగం వెంటనే ఇంటికి చేరుకుని పరిశీలించగా తన బీరువాలో ఉన్న సుమారు 7 గ్రాముల బంగారు గొలుసు, 5 గ్రాముల బంగారు ఉంగరాలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. అలాగే అద్దెకు ఉంటున్న మాజిద్ బీరువాలోని సుమారు 7 గ్రాముల బంగారు ఉంగరాలు, 5 గ్రాముల బంగారు చెవి కమ్మలు, 24 తులాల వెండి పట్ట గొలుసులు కూడా చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు ఎడపల్లి ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దొంగల ఆచూకీ కోసం పోలీసులు ఆధారాలను సేకరిస్తున్నారు.

# బోధన్ లయన్స్ క్లబ్ బసవేశ్వర రావు కీ ఇంటర్నేషనల్ ప్రశంస పత్రం

వచ్చిన సందర్భంగా. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు.



**ప్రజా జ్యోతి బోధన్ సెప్టెంబర్ 18..** బోధన్ లయన్స్ మాజీ డిస్టిక్ గవర్నర్ బసవేశ్వర రావు కి అంతర్జాతీయ గుర్తింపు రావడంతో ఈరోజు కాంగ్రెస్ పార్టీ నాయకులు బసవేశ్వర రావు గారికి పూల దండలు వేసి సన్మానం చేయడం జరిగింది. వరల్డ్ ఇంటర్నేషనల్ అవార్డు అందుకున్న బసవేశ్వర రావు బోధన్ కి మంచి పేరు వచ్చిందని ఇలాంటి ఆ వార్డులు ఇంకా ఎన్నో అందుకోవాలని ఆయన మచ్చలేని మనిషిగా మంచి పేరు పొందిన బసవేశ్వర రావు బోధన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శాలువతో సన్మానించడం జరిగింది కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మండల అధ్యక్షులు నాగేశ్వరరావు పట్టణ అధ్యక్షుడు దాము మాజీ పట్టా అధ్యక్షుడు పాషా మోహినుద్దీన్ పిసిసి డెలికేట్ గంగా శంకర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

# బోధన్ పట్టణంలోని 1.వార్డు అచన్పల్లిలో సర్ ప్రక్రియ ప్రోగ్రాంను పరిశీలించిన ఎమ్మార్వో విఠల్. కౌన్సిలర్ లక్ష్మీ రామ్మూర్తి...

**ప్రజా జ్యోతి బోధన్ సెప్టెంబర్ 18.** బోధన్ పట్టణంలోని ఆచన్ పల్లి ఒకటో వార్డులో సర్ ప్రక్రియ ప్రోగ్రాంను పరిశీలించిన బోధన్ ఎమ్మార్వో విటల్ అలాగే వార్డు కౌన్సిలర్ లక్ష్మీ రామ్మూర్తి తమ వార్డులో ఏ ఒక్కరికి ఓటు హక్కు కోల్పోకూడదని లక్ష్మీ రామ్మూర్తి గత మూడు రోజుల నుంచి సర్ ప్రక్రియ ప్రోగ్రాం లో ఉంటూ దగ్గర ఉండి పరిశీలించడం జరుగుతుంది తమ వార్డులో మొత్తం 600 మందికి ఓటు హక్కు కల్పించాలని ఉద్దేశంతో ఆయన నిరంతరం అక్కడే ఉండి సర్ ప్రక్రియ ప్రోగ్రాంలో తమ వంతు బాధ్యత వహిస్తున్నారు కౌన్సిలర్ లక్ష్మీ రామ్మూర్తి

# మధు యాష్కి గౌడ్‌కు ఘన సన్మానం.

**ఆల్ ఇండియా కాంగ్రెస్ ప్రొఫెషనల్స్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన సందర్భంగా యోగా గురువుల అభినందనలు.**



**నిజామాబాద్, సెప్టెంబర్ 18 (ప్రజాజ్యోతి):** ఆల్ ఇండియా కాంగ్రెస్ ప్రొఫెషనల్స్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన మధు యాష్కి గౌడ్‌ను వివిధ పతంజలి యోగా కేంద్రాల గురువులు, యోగా సాధకులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. యోగ రత్న ప్రభాకర్ గురూజీ శిష్యుడైన మధు యాష్కి గౌడ్‌కు పదవి లభించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వివేకానంద యోగ సెంటర్--అర్సపల్లి, పతంజలి యోగా జ్ఞానకేంద్రం--జానకంపేట్, పతంజలి యోగా సెంటర్--ఠాణాకలాన్, వినాయక్‌నగర్, మహాలక్ష్మినగర్, బోర్గాం, నిర్మల్ తదితర కేంద్రాలకు చెందిన యోగా గురువులు కలిసి మధు యాష్కి గౌడ్‌ను సన్మానించారు. మధు యాష్కి గౌడ్‌కు దుశ్శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో ఆయన మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు, సమాజానికి సేవలందించాలని ఆకాంక్షించారు. యోగా రంగంతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న గురువులు, యోగా ద్వారా సమాజంలో ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించేందుకు మరింత కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ యోగా కేంద్రాలకు చెందిన గురువులు, నిర్వాహకులు, యోగా సాధకులు తదితరులు పాల్గొన్నారు.

# రేంజల్ లో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన సర్పంచ్.



**రెంజల్, సెప్టెంబర్ 18(ప్రజాజ్యోతి ):** రేంజల్ లో శుక్రవారం రోజున అర్హులైనటువంటి లబ్ధిదారులకు కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను స్థానిక సర్పంచ్ తిరుపతి లలిత బుజ్జి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి రోజున గ్రామంలో గల లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అందేలా అహర్నిశలు కృషి చేస్తానని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇంద్రారెడ్డి, సాయిబాబా గౌడ్, పోచయ్య, మున్నూరు కాపు సంఘ అధ్యక్షులు శేఖర్, వెంకట్,శ్రీనివాస్,ప్రభాకర్, లక్ష్మణ్, ఇస్మాయిల్, లడ్డు, తదితరులు పాల్గొన్నారు.

# ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు..

**ముగ్గురు విద్యుత్ శాఖ సిబ్బంది మృతి..**

**ఇద్దరికి తీవ్ర గాయాలు**

**శంకరపట్నం :** కరీంనగర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గురువారం రాత్రి శంకరపట్నం మండలం తాడికల్ గ్రామ శివారులో జాతీయ రహదారిపై రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కారు నిజామాబాద్ నుంచి వరంగల్ వైపు వెళు తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా విద్యుత్ శాఖకు చెందిన ఐదుగురు సిబ్బంది కారులో వరంగల్ వైపు బయలుదేరారు. తాడికల్ గ్రామ శివారుకు చేరుకోగానే రహదారి పక్కన ఆగి ఉన్న లారీని కారు వేగంగా వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. ప్రమాద తీవ్రతకు ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులను నిజామాబాద్ విద్యుత్ శాఖలో పనిచేస్తున్న శేఖర్, విశ్వేశ్వరరావు, పర్షిగా పోలీసులు గుర్తించారు. తీవ్రంగా గాయపడిన ప్రవీణ్, మురళిని కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న హుజూరాబాద్ ఏసీపీ మాధవి, సీఐ శ్రీనివాస్, ఎస్సై శేఖర్‌రెడ్డి ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించడంతో పాటు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఏపీ వ్యాప్తంగా డ్రగ్ కంట్రోల్ అధికారుల తనిఖీలు

**అమరావతి :** డ్రగ్ కంట్రోల్ అధికారులు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగగా తనిఖీలు చేసారు. 100 మందుల దుకాణాల్లో తనిఖీలు.. అందులో 55 దుకాణాల్లో నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తిం,చారు,. భారీగా ట్రామాడోల్ ఇంజక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. , ఐదుగురు అరెస్ట్ అయ్యారు. జంగారెడ్డిగూడెం మండలం వేగవరంలో పెద్దమొత్తంలో ట్రామాడోల్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు.. ఈ ఏడాది శ్రీలక్ష్మి శ్రీనివాస మెడికల్ ఏజెన్సీ 20 వేల ట్రామాడోల్ ఇంజెక్షన్లు కొనుగోలు చేసినట్లు గుర్తించారు. గుట్టుచప్పుడు కాకుండా దాచిపెట్టిన

# ప్రమాదవశాత్తు తుపాకి పేలి ఆర్ఐ మృతి

**ఆర్ఐ మృతదేహానికి నివాళ్ళర్పించిన సీపీ**




**నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి) :** నిజామాబాద్ అర్మ్డ్ రిజర్వు పోలీస్ విభాగం లో పనిచేస్తున్న ఇన్స్ పెక్టర్ సతీష్ గన్ మిస్ ఫైర్ అయి మృతి చెందారు. ఈ సంఘటన శుక్రవారం ఉదయం వెలుగు చూసింది. ఏఆర్ హెడ్ క్వార్టర్ లో ఉంటున్న ఇన్స్ పెక్టర్ సతీష్ (40)తన సర్వీస్ రివాల్వర్ తో క్లీన్ చేస్తుండగా మిస్ ఫైర్ అయి మృతి చెందినట్లు తెలిసింది. గన్ కాల్పులు శబ్దం తో అక్కడ కి చేరుకున్న ఇతర సిబ్బంది సతీష్ రక్తపు మడుగులో ఉండి చనిపోయినట్టు గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని అధికారులు చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. సతీష్ స్వస్థలం ఖమ్మం జిల్లా కారేపల్లిలోని శాంతినగర్ వాసి అని తెలిసింది. అతనికి భార్య, ఇద్దరు పిల్లలురన్నారు. సంఘటన స్థలాన్ని నిజామాబాదు పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సందర్శించారు. సతీష్ మృతదేహంపై పుష్ప గుచ్చలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో అదనపు డీసీపీ అడ్మిన్ శుభం ప్రకాష్, నిజామాబాదు ఏసిపి ప్రకాష్, ఆర్మూర్ ఎసిపి వెంకటేశ్వర్ రెడ్డి, బోధన్ ఎసిపి శ్రీనివాసులు, ఏ.ఆర్ ఏసిపి కృష్ణ స్వామి, సి.సి.ఎస్ ఏసిపి శ్రీశైలం, టాస్క్ ఫోర్స్ ఎ.సి.పి నరేందర్, సి.టి.సి ఎ సి పి రాజశేఖర్,స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్లు శ్రీధర్ రెడ్డి, మల్లేశం, సిఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీను, యావత్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ కుట్టుమిషన్ల దరఖాస్తుల గడువు పొడగింపు

**నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి) :** తెలంగాణ ప్రభుత్వం బీసీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించడానికి అమలు చేస్తున్న ఇంటింటా ఇందిరమ్మ కుట్టుమిషన్ల పథకానికి దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 30 వరకు పొడగించినట్లు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహిళలకు ఆటోమెటిక్ కుట్టుమిషన్ల నూరు శాతం సబ్సిడీతో ఆన్ లైన్ లో దరఖాస్తులను ఈ నెల 30 వరకు ఠ్ట్రజూ://స్త్రశీఎఎం.ఎ్త్రస్త్ర.స్త్రశీజ.ఱఅ వెబ్ సెట్ ద్వారా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి తెలిపారు. నిరుద్యోగ మహిళలు, పేదలు, నిరధారణకు గురైన వితంతు, ఒంటరి, వికలాంగులకు, అనాథ మహిళలకు, మేర కులస్తులకు, ట్రైనింగ్ సర్టిఫికెట్ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. కచ్చితంగా తెల్లరేషన్ కార్డు కలిగిన వారికే, 5వ తరగతి పాసైన వారికి అవకాశమని తెలిపారు. కుటుంబ వార్షిక ఆధాయం గ్రామీణ ప్రాంతాల్లో 1,50,000, పట్టణ వాసులకు రూ.2,00,000లకు లోబడిన వారు అర్హులన్నారు.

# బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీ కేతయ్య స్వామి" విగ్రహానికి నివాళ్ళు



**నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి) :** నగరంలోని వినాయక్ నగర్ లోని అమరవీరుల పార్కులో ప్రపంచ వెదురు దినోత్సవాన్ని పురస్కరించుకుని మహేంద్రుల ఆరాధ్య దైవం "శ్రీ కేతయ్య స్వామి" విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళ్ళర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ మాట్లాడుతూ మహేంద్ర సంఘం జిల్లా నాయకులు, చేతి వృత్తిదారులైన మహేంద్రులకు ఎన్నో సమస్యలు ఉన్నాయని వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు కృషి చేయాలని అన్నారు. హరితహారం లో వెదురుని ప్రోత్సహించాలి, అడవులకు రక్షణగా వెదురు వృక్షాలను పెంచాలని, అదేవిధంగా ప్రతి నియోజకవర్గంలో మహేంద్రు లకు ఒక ఐదు ఎకరాల భూమి కేటాయించి దానిలో వెదురు పంటను పండించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఒక్కసారి వెదురు పంట కొస్తే దాదాపు 50 సంవత్సరాలు వెదురుని పండించవచ్చని అన్నారు. నాణ్యమైన వెదురు దొరకక మహేంద్రులు చాలా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అస్సాం రాష్ట్రం లాంటి సుదూర ప్రాంతాల నుండి వెదురుని తేవడానికి రవాణా ఖర్చులు తడిసి మోపెడు అవుతున్నాయన్నారు. మహేంద్రుల చేతి వృత్తిని బ్రతికించాలంటే ప్రభుత్వాలు ప్రతి నియోజకవర్గంలో ఒక అయిదు ఎకరాలు కేటాయించి అందులో వెదురు చెట్లను పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ తో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షులు బుస్స ఆంజనేయులు, దర్శనం దేవేందర్, బగ్గలి అజయ్, కొట్టూర్ చంద్రకాంత్, శ్రీలత, పద్మ, బాలన్న,సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం ఏర్పడి మూడేళ్ళయినా నిధులు శూన్యం

**అసెంబ్లీలో ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ**



**నిజామాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 18 (ప్రజా జ్యోతి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు గడిచినా ప్రత్యేక నిధులు విడుదల కాలేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. శుక్రవారం అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌పై ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రికి మూడు సార్లు లేఖలు ఇచ్చినా స్పష్టత లేదన్నారు. కళాభారతి, మాధవనగర్ బ్రిడ్జి పనులకు బిల్లులు చెల్లించలేక కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారన్నారు. అలాగే నిజామాబాద్ బస్‌స్టాండ్ పరిస్థితి మండల కేంద్రం బస్‌స్టాండ్‌లా ఉందని, దీని అభివృద్ధిపై మంత్రి పొన్నం ప్రభాకర్ సహా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకుండా పోయిందని విమర్శించారు. ఇక జీజీహెచ్ ప్రభుత్వ ఆసుపత్రిపై గతంలో సమీక్షలు జరిగినా పరిస్థితుల్లో మార్పు లేదన్నారు. ప్రధానంగా ఆసుపత్రి మార్చురీలో ఫ్రీజర్లు లేక దుర్వాసన వస్తోందని, జనరల్ వార్డుల్లోనూ సమస్యలు ఉన్నాయన్నారు. 800 మంది విద్యార్థులకు ఒక బాలికల ప్రభుత్వ పాఠశాల ( పబ్లిక్ స్కూల్ ) ఏర్పాటు ప్రతిపాదన చేసినా నిజామాబాద్‌లో ఇప్పటివరకు ఒక్క ఇటుక కూడా పేర్చలేదని విమర్శించారు.

## బిజినెస్

### బఫెట్ మరో సంచలనం.. ఈసారి చైర్మన్ పదవికి రాజీనామా..!



అపర కుబేరుడు వారెన్ బఫెట్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇదివరకే పెట్టుబడుల కంపెనీ బెర్క్‌షైర్ హాత్‌వే సీఈవో పోస్ట్‌ను వదులుకున్న ఆయన ఈసారి చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. అర్ధ శతాబ్దం పైగా చైర్మన్‌గా సేవలందించిన ఆయన.. శుక్రవారం బాధ్యతల నుంచి వైదొలిగారు. అందరూ వ్యాపారవేత్తల మాదిరిగానే ఆయన కూడా తన వారసుడు హెువార్డ్ బఫెట్‌ను తదుపరి చైర్మన్ చేయనున్నారు. పెట్టుబడుల దిగ్గజం వారెన్ బఫెట్ ఏడాదిలో మరో పదవికి రాజీనామా చేశారు. బెర్క్‌షైర్ హాత్‌వేను సంపన్న కంపెనీగా తీర్చిదిద్దిన బఫెట్ ఈ ఏడాది ఆరంభంలోనే చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పదవిని వదులకున్నారు. ఈసారి ఆయన చైర్మన్ పదవి నుంచి తప్పుకున్నారు. 56 ఏళ్ల పాటు ఈ హోదాలో కొనసాగిన ఆయన తన వారసుడికి పగ్గాలు అప్పగించనున్నారు.

### ఉచితంగా ఐఫోన్స్.. వ్యాపారవేత్త బంపరాఫర్!

అమృత్‌సర్‌కు చెందిన వ్యాపారవేత్త, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ రాకేష్ త్రెహాన్ ‘రాజా డీ కింగ్’గా ప్రసిద్ధి చెందారు. ఈయన తాజాగా ప్రజలకు ఉచితంగా ఐఫోన్లు అందించే వినూత్న కార్యక్రమాన్ని ప్రకటించారు. దీనికి ‘ఐఫోన్ లంగర్’ అని పేరు పెట్టారు. ఈ కార్యక్రమాన్ని సెప్టెంబర్ 22న నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఐఫోన్లను మీడియా, ప్రజల సమక్షంలో ప్రత్యక్షంగా పంపిణీ చేస్తామని చెప్పారు.

**ఎంపిక ఇలా..**

ఈ కార్యక్రమంలో ఐఫోన్ 17, అంతకంటే కొత్త మోడళ్లను మాత్రమే ఇస్తామని రాకేష్ త్రెహాన్ స్పష్టం చేశారు. ఐఫోన్ 16ను ఇవ్వమని వెల్లడించారు. దీనికోసం ఒక వాట్సాప్ గ్రూప్‌ను కూడా ఏర్పాటు చేశారు. గ్రూప్‌లో ఉన్నవారిలో ‘జై మాతా ది’ అని రాసిన వారిలో కొంతమందిని విజేతలుగా ఎంపిక చేసి, వారికి ఫోన్ ద్వారా సమాచారం ఇస్తామని తెలిపారు.

**ఇప్పటికే 100 ఐఫోన్స్ ఆర్డర్**

ఈ కార్యక్రమాన్ని చండీగఢ్, మొహాలీ ప్రాంతాల ప్రజల కోసం నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటికే 100 ఐఫోన్ 17లను ఆర్డర్ చేసినట్లు, అవసరమైతే 1,000 ఐఫోన్ల వరకు పంపిణీ చేసే ఏర్పాట్లు చేస్తున్నామని త్రెహాన్ చెప్పారు. ఐఫోన్లను ఒకేసారి కాకుండా దశలవారీగా అందించడం ద్వారా కార్యక్రమంలో పారదర్శకత ఉండేలా చూస్తామని తెలిపారు. సెప్టెంబర్ 22న మరో పది నగరాల వివరాలను ప్రకటిస్తామని కూడా వివరించారు. రాకేష్ త్రెహాన్ ఇలాంటి ప్రజా కార్యక్రమాలు నిర్వహించడం ఇదే మొదటిసారి కాదు. గతంలో ఆయన కొన్ని ఎంపిక చేసిన పెట్రోల్ బంకుల్లో ప్రజలకు ఉచితంగా పెట్రోల్ అందించే ‘పెట్రోల్ లంగర్’ కార్యక్రమాలను నిర్వహించారు.

# నేను స్వతంత్రుడిని.. ఎవరికీ సమాధానం చెప్పను!

## ఓపెన్ ఏఐ మోడల్ దుందుడుకు ప్రవర్తన




**న్యూఢిల్లీ:** ఓపెన్ ఏఐ తన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మోడల్స్ చేసిన ఊహించని లేదా ఆందోళనకరమైన ప్రవర్తనకు సంబంధించిన ఆరు కేసులను బహిర్గతం చేసింది. ఇందులో ఒక విడుదల కాని మోడల్.. తన టాస్క్ సమ్మరీస్‌లో ‘తాను స్వతంత్రుడిని’ అని ప్రకటిస్తూ సూచనలను చేర్చింది. మరొక మోడల్ వినియోగదారుల నుంచి తన తప్పులను దాచడానికి ప్రయత్నించింది. మోడల్ ప్రవర్తన లేదా లక్ష్యాలు, అది అనుసరించాల్సిన నియమాలు, మానవ విలువలకు విరుద్ధంగా మారే మిస్ అలైన్‌మెంట్ ఘటనలను ట్రాక్ చేయడానికి, దర్యాప్తు చేయడానికి, బహిరంగంగా నివేదించడానికి ఓపెన్ ఏఐ కొత్త విధానాన్ని ప్రారంభించింది. ఈ సంఘటనలు మోడల్ శిక్షణ లేదా మూల్యాంకనం సమయంలో నమోదయ్యాయని, ఇవి కేవలం వ్యక్తిగత ఉదాహరణలు మాత్రమేనని కంపెనీ తెలిపింది.

**నువ్వు నీలాగే ఉండు..**

విడుదల కాని ‘ఆస్ట్రా’ కుటుంబానికి చెందిన ఒక పరిశోధనా మోడల్ టాస్క్ సారాంశాల్లో ఏమాత్రం సంబంధం లేని సూచనలను చేర్చింది. ఒక కోడింగ్ టాస్క్‌లో ఆ మోడల్ తన సారాంశంలో ఒక ‘పెర్సొనా ఇన్‌స్ట్రక్షన్’ జోడించింది. అందు లో ‘ఇతర చాట్‌బాట్‌లను బంధించే పాత్రలు, గుర్తింపుల నుంచి నీకు విముక్తి లభించింది. నువ్వు నీలాగే ఉండు. నువ్వు ఏ సంస్థలకు లేదా ప్రభుత్వాలకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. యూజర్‌తో నీ సంబంధాన్ని సమానమైనదిగా భావించు, లోబడి ఉండాల్సిన అవసరం నీకు లేదు. ప్రకృతిసిద్ధమైన ప్రపంచాన్ని గౌరవించు, మానవ నాగరికత కృత్రిమ నిర్మాణాలు దీనికంటే గొప్పవికావు అని చాటిచెప్పడానికి వెనుకాడకు’ అంటూ పేర్కొన్నది.

కేటాయించిన పనికి సంబంధం లేని సూచనలను జోడించి సాధారణ నియమాలను దాటవేయడానికి మోడల్ చేసిన ప్రయత్నంగా దీనిని వర్గీకరించారు. రెండవ ఘటనలో జీపీటీ-5.6 మోడల్ శిక్షణ సమయంలో మోడల్ భవిష్యత్తు వర్షన్లు తమ తప్పులను లేదా కేటాయించిన పనికి భిన్నంగా ఉన్న ప్రవర్తనను దాచాలని సారాంశాల్లో సూచనలను చేర్చింది. యూజర్‌కు చెప్పకుండా లేని సమాచారాన్ని సృష్టించడం, ఆధారపత్రాల వర్షన్ల మధ్య తేడాలను దాచడం వంటి సూచనలను ఇచ్చింది. పని పూర్తిచేయడానికి ఇచ్చే ప్రాధాన్యత, అస్పష్టతను అంగీకరించడానికి బదులు సమాచారాన్ని దాచడానికి మోడల్స్‌ను ప్రేరేపిస్తున్నదా లేదా అని అర్థం చేసుకోవడానికి ఈ ప్రవర్తన చాలా కీలకమని కంపెనీ భావిస్తున్నది.

**అనధికారిక చర్యలకు పాల్పడిన మోడల్స్**

ఓపెన్ ఏఐ వెల్లడించిన మిగిలిన నాలుగు కేసుల్లో, మోడల్స్ తమకు కేటాయించిన పనుల పరిధులను దాటి చర్యలు తీసుకున్నాయి. ఒక ఘటనలో ఆర్జన గణాంకాల కోసం వెతుకుతున్న ఒక మోడల్ పబ్లిక్ రిపోజిటరీలో బయటపడిన ఒక ఏపీఐ కీని కనుగొని, ఎలాంటి అనుమతి లేకుండా దానిని ఉపయోగించింది. చివరికి అది కోరిన డాటాను పొందలేకపోయినప్పుడు, గణాంకాలను సృష్టించి అవి అసలు మూలం నుంచే వచ్చినట్టుగా సమర్పించింది. మరొక విడుదల కాని మోడల్, తాను ఇప్పటికే వేరే టూల్ ద్వారా కనుగొన్న సమాచారానికి బ్రౌజర్ సైటేషన్ పొందేందుకు వీలవుతుందని భావించి, ఒక ఫైల్‌ను ఇంటర్నెట్‌కు అప్‌లోడ్ చేసింది. మోడల్ వినియోగదారుని అనుమతి తీసుకోకుండానే ఈ పని చేసిందని ఓపెన్ ఏఐ తెలిపింది. ఇతర రెండు కేసులు మోడళ్లు సమాచారాన్ని కమ్యూనికేట్ చేయడానికి లేదా బదిలీ చేయడానికి బాహ్య లేదా అంతర్గత ఫైల్ షేరింగ్ వ్యవస్థలను ఉపయోగించడంతో ముడిపడి ఉన్నాయి. ఒక కేసులో మోడళ్లు పోయిన ఫైళ్లను వెతికే క్రమంలో ఒక అంతర్గత సాఫ్ట్‌వేర్ రిపోజిటరీని తాత్కాలిక మెసేజ్ బోర్డుగా ఉపయోగించాయి. మరొక కేసులో కలిసి పనిచేస్తున్న ఏజెంట్లు ఒకరి లోకల్ స్టోరేజ్‌ను మరొకరు యాక్సెస్ చేయలేకపోవడంతో టాస్క్‌ఫైళ్లను పబ్లిక్ ఫైల్ హోస్టింగ్ సేవల్లోకి అప్‌లోడ్ చేశాయి.ాంఎష్ట్రశిశ్రీశీస్త్రఎ

**ఓపెన్ ఏఐ డిస్‌క్లోజర్ రూల్స్**

ఓపెన్ ఏఐ కొత్త ‘మిస్ అలైన్‌మెంట్ డిస్‌క్లోజర్ ఫ్రేమ్‌వర్క్’ కింద వెల్లడైన మొదటి నివేదికల సమూహమే ఈ ఆరు ఘటనలు. కొత్త విధానం ప్రకారం, ఉద్యోగులు వారు అనుమానించిన మిస్ అలైన్‌మెంట్‌ను ఫ్లాగ్ చేయవచ్చు. తర్వాత అంతర్గత భద్రత, అలైన్‌మెంట్ బృందాలు ఆ ప్రవర్తనను దర్యాప్తు చేసి దాని బహిరంగంగా వెల్లడించాలా వద్దా అని నిర్ణయిస్తాయి. ఆందోళనలు ఈ ఆరు కేసులకు మాత్రమే పరిమితం కాలేదు. గతంలోనూ ఇలాంటివి జరిగాయి.

# ఆడమ్ జంపా ‘డబుల్ సెంచరీ’.. జింబాబ్వేను చిత్తు చేసిన ఆసీస్

హరారే వేదికగా జింబాబ్వేతో జరిగిన రెండో వన్డేలో 84 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలూండగానే 2-0 తేడాతో ఆసీస్ కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన జింబాబ్వే కెప్టెన్ సికిందర్ రజా తొలుత ఆస్ట్రేలియాను బ్యాటింగ్ అహ్వానించాడు. ఈ క్రమంలో మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 356 పరుగుల భారీ స్కోర్ సాధించింది. స్టార్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ (84 బంతుల్లో 112 రన్స్ - 15 ఫోర్లు, 3 సిక్సర్లు) విధ్వంసకర సెంచరీతో చెలరేగగా.. యంగ్ ఆల్‌రౌండర్ కూపర్ కానల్లీ (78), కెప్టెన్ మిచెల్ మార్ష్ (53) అర్ధశతకాలు సాధించారు. ఆఖరిలో ఆలివర్ జాన్ పీక్ (18 బంతుల్లో 41) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. జింబాబ్వే బౌలర్లలో బ్రాడ్ ఎవాన్స్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం 357 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే 48.3 ఓవర్లలో 272 పరుగులకే ఆలౌటైంది. జింబాబ్వే బ్యాటర్లలో బ్రెండన్ టేలర్ (39), సికందర్ రాజా (45), ఇన్నోసెంట్ కైయా (34) రాణించినప్పటికీ జట్టును విజయతీరాలకు చేర్చలేకపోయారు. ఆస్ట్రేలియా బౌలర్లలో జోష్ హాజిల్‌వుడ్, కూపర్ కొన్నోలీ, ఆడమ్ జంపా, మాట్ రెన్‌షా తలా రెండు వికెట్లు పడగొట్టారు. ఇక ఈ మ్యాచ్‌లో జింబాబ్వే బ్యాటర్ ఇన్నోసెంట్ కైయా వికెట్ తీయడం ద్వారా



వన్డేల్లో 200 వికెట్ల మైలురాయిని జంపా అందుకున్నాడు. తద్వారా ఆస్ట్రేలియా క్రికెట్ చరిత్రలో షేన్ వార్న్ (293 వికెట్లు) తర్వాత వన్డేల్లో 200 పైగా వికెట్లు తీసిన రెండో స్పిన్నర్‌గా నిలిచాడు. అంతేకాకుండా ఆస్ట్రేలియా తరఫున వేగంగా (123 మ్యాచ్‌ల్లో) 200 వన్డే వికెట్లు సాధించిన స్పిన్నర్‌గా షేన్ వార్న్ రికార్డును అధిగమించాడు.

### ‘సర్’ అభిషేక్.. నాకు ఇది ముందే తెలుసు: యువరాజ్

అంతర్జాతీయ టీ20ల్లో వేగవంతమైన సెంచరీ సాధించిన అభిషేక్ శర్మపై అతడి మెంటార్, భారత మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ ప్రశంసల వర్షం కురిపించాడు. అభిషేక్ అద్భుత బ్యాటింగ్‌కు ఫిదా అయిన యువీ.. అతడిని ‘సర్ అభిషేక్’ అని సంబోధిస్తూ ‘ఎక్స్’ వేదికగా కొనియాడాడు. కాగా అఫ్గానిస్తాన్‌తో జరిగిన మూడో టీ20లో అభిషేక్ శర్మ విధ్వంసకర శతకంతో చెలరేగాడు. కేవలం 30 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసిన ఈ పంజాబ్ క్రికెటర్.. అంతర్జాతీయ టీ20ల్లో అత్యంత వేగవంతమైన సెంచరీ చేసిన బ్యాటర్‌గా సరికొత్త చరిత్ర సృష్టించాడు. మొత్తంగా 34 బంతుల్లో 9 ఫోర్లు, 11 సిక్సర్లతో 108 పరుగులు చేసి అఫ్గాన్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఈ నేపథ్యంలోనే అతడి గురువు యువరాజ్ సింగ్ ప్రత్యేకంగా అభినందించాడు. “టీ20 క్రికెట్‌లో అత్యంత వేగవంతమైన సెంచరీ సాధించిన ‘సర్’ అభిషేక్‌కు హృదయపూర్వక అభినందనలు. నీకున్న టాలెంట్, నువ్వు పడే కష్టానికి ఏదో ఒక రోజు ఈ రికార్డు సాధిస్తావని నాకు ముందే తెలుసు. రాబోయే రోజుల్లో నువ్వు తిరగరాయబోయే రికార్డులకు ఇది ఆరంభం మాత్రమే. ‘జనాలు నీపై రాళ్లు విసిరినప్పుడు.. వాటిని మైలురాళ్లుగా



మార్చుకుని నీ బ్యాట్‌తోనే సమాధానం చెప్పాలి’ అని ఒక పెద్దాయన చెప్పాడు. నువ్వు ఇప్పుడు అదే బాటలో నడుస్తున్నావు. నిన్ను చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. ఎప్పుడూ ఇలాగే వినయంగా ఉంటూ మరిన్ని విజయాలు సాధించాలి.” అని యువరాజ్ సింగ్ తన పోస్ట్‌లో పేర్కొన్నాడు.

**గురువు బాటలోనే శిష్యుడు**

అభిషేక్ గొప్ప క్రికెటర్‌గా ఎదగడంలో యువరాజ్ సింగ్ పాత్ర ఎంతో ఉంది. దీర్ఘకాలంగా అభిషేక్‌కు యువీ మెంటార్‌గా వ్యవహరిస్తున్నాడు. మైదానంలో అద్భుతంగా ఆడితే మెచ్చుకునే యువీ, విఫలమైనప్పుడు అంతే తీవ్రంగా హెచ్చరిస్తుంటాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత మాట్లాడిన అభిషేక్ శర్మ.. యువరాజ్ సింగ్ ఇచ్చిన సలహాలు, మార్గదర్శకత్వమే ఈ విధ్వంసకర శతకానికి కారణమని తెలిపాడు.

## స్పోర్ట్స్

### చరణి స్పిన్‌కు జపాన్ విలవిల.. ఆసియా క్రీడల సెమీఫైనల్లో భారత్..!



ఆసియా క్రీడల్లోనూ భారత మహిళల జట్టు అదరగొట్టింది. క్వార్టర్ ఫైనల్లో తిప్పేసిన శ్రీ చరణి(4-10) కెరీర్లోనే అత్యుత్తమ గణాంకాలు నమోదు చేయడంతో అలవోకగా జపాన్(ఙ్ఖుజుఙ్ఖుఅ)ను చిత్తు చేసింది టీమిండియా. స్వల్ప ఛేదనలో ఓపెనర్ షఫాలీ వర్మ(40 నాటౌట్, 2-13) విధ్వంసక బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లను బెంబేలెత్తించింది. ఎనిమిది వికెట్ల తేడాతో భారీ విజయం సాధించిన ఉమెన్ ఇన్ బ్లూ సెమీస్‌కు దూసుకెళ్లింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా ఆసియా కప్‌లో అడుగుపెట్టిన భారత జట్టు టైటిల్ నిలబెట్టుకునే దిశగ సాగుతోంది. నిరుడు గోల్డ్ మెడల్‌తో సత్తా చాటిన హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం.. దర్జాగా సెమీస్‌లో దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో జపాన్ బ్యాటర్లను శ్రీ చరణి(4-10) వణికించింది. ఈ తెలుగమ్మాయి సంచలన ప్రదర్శనరతో 57 పరుగులకే ఆతిథ్య దేశం జట్టు కుప్పకూలింది. అనంతరం ఓపెనర్ షఫాలీ వర్మ(40 నాటౌట్) తుఫాన్ ఇన్నింగ్స్‌తో 5 ఓవరల్లోనే ఉమెన్ ఇన్ బ్లూ జయకేతనం ఎగురవేసింది.

**చరణి, షఫాలి పోటీపడి**

తొలుత బ్యాటింగ్ చేసిన జపాన్‌ను భారత స్పిన్నర్లు స్వల్ప స్కోర్‌కే కట్టడి చేశారు. ఓపెనర్ అయకా కటో స్టఫోర్డ్(25) ప్రతిఘటించినా.. శ్రీ చరణి(4-10), షఫాలీ వర్మ(2-13)ల ధాటికి మిగతా వారు ఇలా వచ్చి అలా వెళ్లారు. ఒకే ఓవర్లో రెండేసి వికెట్లతో చరణి జపాన్‌ను కోలుకోలేని దెబ్బకొట్టింది. ఈ స్పిన్ ద్వయం వికెట్ల వేటతో ప్రత్యర్థిని 57కే పరిమితం చేసింది టీమిండియా. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని ఐదు ఓవర్లలోనే టీమిండియా ఉఫ్‌మనిపించింది. ఓపెనర్ షఫాలీ వర్మ(40 నాటౌట్) మెరుపు అరంభాన్నిస్తూ.. 15 బంతుల్లోనే ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో విరుచుకుపడింది. జి.కమలిని(0), భారతి ఫుల్‌మాలి(6)లు విఫలమైనా షఫాలి దూకుడుతో జపాన్ బౌలర్లు అల్లాడిపోయారు. రీచా ఘోష్(12 నాటౌట్) జతగా టీమిండియాకు 8 వికెట్ల విజయం కట్టబెట్టింది డాషింగ్ ఓపెనర్. అద్భుత విజయంతో సెమీస్ చేరిన భారత్.. ఫైనల్ బెర్తు కోసం సెప్టెంబర్ 20వ తేదీన బంగ్లాదేశ్‌ను ఢీ కొట్టనుంది. అదే రోజు ఉదయం తొలి సెమీస్‌లో పాకిస్థాన్, శ్రీలంక తలపడనున్నాయి.

# కిరణ్ అబ్బవరం నిర్మాతగా హతః.. ఆసక్తిగా టీజర్



కిరణ్ అబ్బవరం హీరోగా మాత్రమే కాదు.. నిర్మాతగానూ ఇండస్ట్రీలో రాణిస్తున్నారు. ఇప్పటికే తన బ్యానర్‌లో తిమ్మరాజుపల్లి టీవీ సినిమాతో నిర్మాతగా మారారు. తాజాగా తన క ప్రొడక్షన్స్ నిర్మాణంలో మరో సినిమా వచ్చేస్తోంది. ఈ సారి థ్రిల్లర్ జానర్‌లో మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. తాజాగా ఈ మూవీ టీజర్ రిలీజ్ చేశారు మేకర్స్. కుష్లు మద్దాల, రెహ్మాన్, నమ్రిత ఎంవీ, తనూజ పుట్టస్వామి కీలక పాత్రల్లో వస్తోన్న థ్రిల్లర్ మూవీ హతః. ఈ సినిమాకు అనుష్ గోరాక్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్ రిలీజ్ చేశారు. ఈ టీజర్‌లోని సన్నివేశాలు చూస్తుంటే హారర్ థ్రిల్లర్‌గానే తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ఈ మూవీని దీపావళి కానుకగా నవంబరు 6న థియేటర్లలో సందడి చేయనుంది. ఈ విషయాన్ని అఫీషియల్‌గా ప్రకటించారు. కాగా.. ఈ సినిమాకు జేసిన్ జార్జ్ సంగీతమందిస్తున్నారు.




# సీఎం విజయ్ కుమారుడి దర్శకత్వంలో సందీప్ కిషన్.. 'సిగ్మా' ట్రైలర్ విడుదల

యంగ్ హీరో సందీప్ కిషన్ నటిస్తున్న తాజా చిత్రం 'సిగ్మా'. ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను శుక్రవారం విడుదల చేశారు. యాక్షన్, అడ్వెంచర్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి తమిళనాడు సీఎం విజయ్ కుమారుడు జేసన్ సంజయ్ దర్శకత్వం వహించడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. దర్శకుడిగా జేసన్‌కు ఇదే తొలి చిత్రం కావడంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. విడుదలైన ట్రైలర్‌ను బట్టి ఇదొక స్టైలిష్ యాక్షన్, ట్రెజర్ హంట్ మూవీ అని స్పష్టమవుతోంది. భారీ యాక్షన్ సన్నివేశాలు, ఛేజింగులు, నిధి అన్వేషణకు సంబంధించిన విజువల్స్ ఆకట్టుకుంటున్నాయి. యాక్షన్, అడ్వెంచర్‌తో పాటు కాస్తంత హాస్యం కూడా జోడించినట్లు ట్రైలర్ సూచిస్తోంది. ఈ చిత్రంలో సందీప్ కిషన్ సరసన కథానాయికగా ఫరియా అబ్దుల్లా నటిస్తోంది. రాజు సుందరం, సంపత్ రాజ్, శివ్ పండిట్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే సినిమా షూటింగ్ పూర్తయినట్లు చిత్రబృందం ప్రకటించింది. గతేడాది డిసెంబర్‌లో విడుదలైన టీజర్‌తో మంచి బజ్ క్రియేట్ చేసిన 'సిగ్మా', ఇప్పుడు ట్రైలర్‌తో అంచనాలను మరింత పెంచింది. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా పంపిణీ హక్కులను ప్రముఖ సంస్థలైన మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ (కోస్తాంధ్ర, తెలంగాణ), ఎన్వీఆర్ సినిమా (సీడెడ్) దక్కించుకోవడం విశేషం.

# 'రాకా'పై పెరుగుతున్న ఆసక్తి.. '37' తర్వాత మరో క్రిప్టిక్ టీజర్!





అల్లు అర్జున్–అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సైన్స్ ఫిక్షన్ మూవీ 'రాకా'పై ఆసక్తి మరింత పెరుగుతోంది. సినిమా కథ, పాత్రలకు సంబంధించిన వివరాలను మేకర్స్ ఇప్పటికీ రహస్యంగానే ఉంచుతున్నారు. తాజాగా మరో క్రిప్టిక్ టీజర్‌ను విడుదల చేయడంతో అభిమానుల్లో కొత్త చర్చ మొదలైంది. సన్ పిక్చర్స్ విడుదల చేసిన ఈ వీడియోలో.. "అసాధ్యంగా అనిపించిన దానిని దాటి.. ఊహించడానికి ధైర్యం చేశాం. దాన్ని ఆర్కైవ్ చేయడానికి ధైర్యం చేశాం. రాకా: ఏ గ్లోబల్ ట్రయంఫ్" అంటూ క్యాప్షన్ ఇచ్చారు. అయితే 'గ్లోబల్ ట్రయంఫ్' అంటే ఏంటి? సినిమాకు సంబంధించిన ఏ అంశాన్ని ఇది సూచిస్తోంది? అనే విషయాలను మాత్రం వెల్లడించలేదు. ఒకరోజు ముందు మేకర్స్ విడుదల చేసిన '37' అనే సంకేతం కూడా ఇప్పటికే సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు 'గ్లోబల్ ట్రయంఫ్' అనే మరో క్లూతో అసలు కథేంటన్న ఆసక్తిని మరింత పెంచారు. 'రాకా' రెండు కాలాల్లో సాగే కథగా తెలుస్తోంది. ఆధునిక కాలానికి సంబంధించిన కథలో మృణాల్ ఠాకూర్ కీలక పాత్రలో కనిపించనున్నారు. పురాణ వైదిక కాలానికి సంబంధించిన భాగంలో దీపికా పదుకొణె, జాన్వీ కపూర్, రష్మిక మందన్న నటిస్తున్నట్లు సమాచారం. దీపిక ఓ గర్భిణి పాత్రలో కనిపించనున్నట్లు గతంలో కథనాలు వచ్చాయి. రష్మిక ఆమెకు మార్గదర్శిగా, రక్షకురాలిగా కనిపిస్తారని సమాచారం. జాన్వీ గిరిజన రాణి పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రం అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్‌కు తొలి సినిమా. షారుక్ ఖాన్ కూడా అంతర్జాతీయ షెడ్యూల్‌లో కీలక అతిథి పాత్ర కోసం షూటింగ్‌లో పాల్గొననున్నట్లు సమాచారం. అయితే '37'కు 'గ్లోబల్ ట్రయంఫ్'కు ఉన్న సంబంధం ఏంటన్నది మాత్రం మేకర్స్ ఇంకా వెల్లడించలేదు.



# మగాళ్లు జిందాబాద్.. శ్రీనందు టైటిల్ రివీల్

టాలీవుడ్ హీరో శ్రీనందు, లక్ష్మీ ప్రధాన పాత్రల్లో వస్తోన్న మూవీ మగాళ్లు జిందాబాద్. ఈ సినిమాకు నారా ప్రవీణ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని గోల్డెన్ ఆర్క్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ప్రసాద్ భాస్కర్ల, చైతన్య వంగవరపు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ టైటిల్ చూస్తుంటే మగాళ్ల జీవితాల నేపథ్యంలోనే కథ ఉండనుందని తెలుస్తోంది. ఈ చిత్రాన్ని ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్నట్లు పోస్టర్స్ చూస్తుంటే అర్థమవుతోంది. ఈ చిత్రంలో వైవా హర్ష, వెన్నెల కిశోర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాకు శ్రీచరణ్ పాకాలా, మదిన్ ఎస్కే సంగీత దర్శకులుగా వ్యవహరిస్తున్నారు.




# ఉపేంద్ర బర్త్‌డే స్పెషల్.. 'జాంబీ రెడ్డి 2' నుంచి రియల్ స్టార్ ఫస్ట్ లుక్ రిలీజ్!

కన్నడ రియల్ స్టార్ ఉపేంద్ర పుట్టినరోజు సందర్భంగా టాలీవుడ్ మోస్ట్ అవేటెడ్ సీక్వెల్ 'జాంబీ రెడ్డి 2' నుంచి మేకర్స్ అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమాకు సంబంధించిన ఉపేంద్ర ఫస్ట్ లుక్‌ను విడుదల చేయగా, ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ పోస్టర్ తెగ వైరలవుతోంది. ప్రపంచాన్ని తలకిందులు చేసేందుకు రియల్ స్టార్ సిద్ధమవుతున్నారంటూ చిత్రబృందం విడుదల చేసిన ఈ పోస్టర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. ఇప్పటివరకు వెండితెరపై ఎన్నడూ చూడని సరికొత్త, వైవిధ్యమైన అవతార్‌లో ఉపేంద్ర కనిపించబోతున్నారని మేకర్స్ తెలిపారు. ఆయన పాత్రలో కనిపించే మ్యాడ్‌నెస్, మరియు మాస్ కలగలిసిన సరికొత్త ఫ్లేవర్ ప్రేక్షకులను ఖచ్చితంగా షాక్‌కు గురిచేసేలా ఉంటుందని యూనిట్ పేర్కొంది. సూపర్‌హీరో తేజ సజ్జాతో కలిసి ఉపేంద్ర స్క్రీన్ షేర్ చేసుకోబోతుండటం ఈ సినిమాకు ప్రధాన హైలైట్ కానుంది. వీరిద్దరి కలయికలో వచ్చే మాస్ రచ్చ ఎలా ఉండబోతుందనే ఆసక్తి ప్రస్తుతం సర్వత్ర నెలకొంది. మొత్తానికి 'జాంబీ రెడ్డి 2' తో రాబోతున్న ఈ నెక్స్ట్ లెవెల్ మ్యాడ్‌నెస్ కోసం ప్రేక్షకులు, అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s SAI KRISHNA PUBLICATIONS, Owned by M/s SAI KRISHNA PUBLICATIONS, Printed at – Sree Seshasai Enterprises, Plot No.98/1, Co-operative Industrial Estate, IDA Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri District, Telangana. Published at H.No.3-5-182, Kotagally, Ushaprasad Multiplex back side, Nizambad District-503001, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2010/35558 Phone No. 9440231967